www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్  సంపుటి : 16  సంచిక : 55  శుక్రవారం, జూలై 10, 2026 , పేజీలు - 12  వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్

# ఆర్థిక వ్యవస్థ





- దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు
- తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు
- హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు
- ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,జూలై 09:**

2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో మిగతా2లో...

## వ్యవసాయ రంగానికి

# పెద్దపీట

- రెండున్నరేళ్లలోనే 35వేల కోట్లు రైతులకు అందచేత
- బిఆర్ఎస్ పాలనలో క్రాప్ డ్యామేజ్‌కు కెసిఆర్ ఒక్క పైసా ఇవ్వలేదు
- ఖమ్మం పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం,జూలై 09 :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మిగతా2లో...

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

### రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు



**హైదరాబాద్,జూలై 09 :** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు

మిగతా2లో...

## హరీష్ రావుపై కెసిఆర్‌కు

# నమ్మకం లేదు

● అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు ● ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం ● సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,జూలై 09 :** ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్

మిగతా2లో...

## బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

- అమరులు కుటుంబాలకు పంచి నిజాయితీ చాటాలి
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్



**భద్రాద్రికొత్తగూడెం,జూలై 09 :** బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ.1,400 కోట్లు అమరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా?అని ప్రశ్నించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా మిగతా2లో...

## కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్టేనని రేవంత్ రెడ్డి సొంత సర్వేలోనే తేలింది : కేటీఆర్



**హైదరాబాద్,జూలై 09 :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్లే అని.. ఇదే అంశం రేవంత్ రెడ్డి చేయించుకున్న సొంత సర్వేలోనూ తేలిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన పరిపాలనపైన, తన నాయకత్వంపైన, సగం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒక విస్తృత సర్వేను చేయించుకున్నారని, అందులోనూ ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, ఎస్ఐఆర్ కమిటీ నేతలు హాజరయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎస్ఐఆర్‌పై ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, అలాగే పార్టీ పరంగా చేయాల్సిన సూచనలపై ఈ సందర్భంగా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## స్పీకర్, మండలి చైర్మన్‌తో

# సిఎస్ భేటీ



2లో

## బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

### సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో కెసిఆర్ నిర్ణయం



**హైదరాబాద్,జూలై 09:**

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్‌గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు గా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో

మిగతా2లో...

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం

2లో

### ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా

# కాంగ్రెస్ పంచాయితీ

కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు

మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి

2లో

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## వ్యవసాయ రంగానికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాధపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.మెగా రైతు మేళా ప్రాంగణంలోనే శుక్రవారం మధ్యాహ్నం రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి చర్యలపై సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, కడెం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని, బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు గత ప్రభుత్వాలు తగిన నీటి వనరులు అందించలేదని, ఆ విషయాన్ని చరిత్రతో సహ నిరూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మాటలతో మోసం చేసే పార్టీ అని, 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు జిల్లాల పర్యటనలు చేస్తూ విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ నీరు ఇవాళ లేదా రేపటిలోగా వైరా రిజర్వాయర్‌కు చేరుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరడంతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి, కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో లేకపోయినా రైతుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కేంద్రం నుంచి అవసరమైన ఎరువులు సాధించామని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు టెక్నాలజీ వినియోగిస్తూ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే వర్షాల సమాచారాన్ని కూడా సాంకేతికత ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నామని వెల్లడించారు.

## హరీష్ రావుపై కెసిఆర్‌కు నమ్మకం లేదు

(మొదటి పేజీ తరువాయి)

చిట్‌చాట్ చేశారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీల్లో డ్యామేజీ మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారు.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వారీగా కార్యాచరణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

## ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా

# కాంగ్రెస్ పంచాయితీ

### కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు

### మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి

**వరంగల్,జూలై 09 :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు జిల్లాలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు కొండా వర్సెస్ కడియం లాగా పరిస్థితి మారింది. కొండా తీరుపైనా స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాదాయంలో గాలికి వదిలేశారని, అన్యాక్రాంత భూములపై చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్‌లోనే విమర్శలు ఉన్నాయి. ఇకపోతే తాజా వివాదంటీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని, ఇది ప్రభుత్వ ప్రోటోకాల్‌కు విరుద్ధమని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. ఇదే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, గ్రూపు రాజకీయాలపై పార్టీ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. కొండా సురేఖ, కడియం శ్రీహరి ఇద్దరితో త్వరలోనే మాట్లాడి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని, అలాంటి చర్యలను పార్టీ ఏమాత్రం సహించబోదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఆయన తెలిపారు.



## బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధ్యలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుందగా..మిగతా .2,845.12 కోట్లు ఊఱఊ లేదా ÷ఱఊఎఱ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్(ఒఖీఆఆఏ)కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్టేనని రేవంత్ రెడ్డి సొంత సర్వేలోనే తేలింది : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ మాట్లాడుతూ.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే భారత రాష్ట్ర సమితి సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందన్నారు. దీంతో పాటు రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం వ్యక్తమైందన్నారు. మరోసారి ప్రజలు కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నామని స్పష్టంగా తమ అభిప్రాయం చెప్పిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అయితే తన సొంత సర్వేతో పాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే ముఖ్యమంత్రి గత వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నా రన్నారు. దీంతోపాటు తన పరిపాలన వైఫల్యాలను ముఖ్యంగా కప్పిపుచ్చుకునేందుకు అనేక అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నారని, అందులో భాగంగానే కాళేశ్వరం నుంచి మొదలుకొని రైతుబంధు వరకు అన్నింటిపైన అడ్డగోలుగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు.**కాంగ్రెస్ పార్టీ పుంజుకునే అవకాశమే లేదు..**

కాంగ్రెస్ పార్టీ పతనం దాదాపు ఖాయమైపోయిందని, నగం పరిపాలనా కాలం ముగిసిన తర్వాత ప్రజలు కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఇచ్చిన గ్యారంటీల అమలు, గ్యారంటీలు, డిక్లరేషన్లు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైనందు వల్లనే తెలంగాణలోని సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై నమ్మకం కోల్పోయారన్నారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా స్పష్టంగా ప్రజలు బీఆర్ఎస్ కావాలని కోరుకుంటున్నారని, బీజేపీ లాంటి ఇతర పార్టీలకు ఏమాత్రం అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు.కాంగ్రెస్ పార్టీ జారుడు బండపైన నిలబడిందని, ఇక పుంజుకునే అవకాశమే లేదన్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా, ఎన్ని రకాల అబద్ధాలు చెప్పినా, ప్రజలను మోసం చేయాలని చూసినా కాంగ్రెస్ పార్టీ ముందు ముందు ప్రజామోదం పొందడం అత్యంత కష్టమన్నారు.

## స్పీకర్, మండలి చైర్మన్‌తో సిఎస్ భేటీ

**హైదరాబాద్,జూలై 09 :** తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.


## బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగూడెంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మా పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు ఇచ్చారు. టీఆర్ఎస్ పేరు నాకు రాకుండా కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి నీతినియమాలు అంటూ ఏమీ లేవా? తల్లి, చెల్లి అనే సభ్యత మరచి పార్టీ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణముండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లను. నా పోరాటాలు ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, భాజపా చేతులు కలిపాయని ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద కేటీఆర్ అక్రమ పర్మిషన్లు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు అనకొండ. బీఆర్ఎస్ పార్టీ ఇంకా ఆయన్నే ముందు పెడుతోంది. ఆ పార్టీ ఈ జన్మలో అధికారంలోకి రాదు. పెద్దాయనకు మరకలు అంటించిన ఆయనకు 3 నెలలు మంత్రి పదవి కావాలంట. కేటీఆర్ ఇటీవల రూ.188 కోట్లతో ఓ ఇంగ్లిష్ పత్రిక కొన్నారు. ఫీనిక్స్ సంస్థకు రూ.80వేల కోట్ల విలువైన భూముల కట్టబెట్టారు. ఆ సంస్థ రూ.33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందని కవిత ఆరోపించారు.

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

### - దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్, జూలై 09 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరం చాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వం కాంగ్రెస్.

- ప్రభుత్వాన్ని రైతులే కాపాడుకుంటారు.
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభకు చింతకాని వేదిక
- 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ
- తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి
- 150 స్టాల్స్ ఏర్పాటు అంచనాలకు మించి 11 వేల మంది రైతుల హాజరు
- మెగా రైతు మేళాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు










**ఖమ్మం /చింతకాని/ జూలై09(పీపుల్స్ న్యూస్ )**
రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు.

ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు. రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు.

రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు.

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.

తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు.

మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు.

రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెగా రైతు మేళాకు 5 వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఎలా వినియోగించు కోవాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# శోభన కాలనీలో రోడ్డుపై కూలిన భారీ చెట్టు తొలగింపు

-- మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ చొరవతో వేగంగా స్పందించిన డీఆర్ఎఫ్ బృందం
-- ట్రాఫిక్‌కు వెంటనే మార్గం సుగమం



**బాలానగర్ జలై 10 (పీపుల్స్ న్యూస్)**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శోభన కాలనీ ఆటో స్టాండ్ వద్ద భారీ చెట్టు ఒక్కసారిగా కూలిపడి రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, ప్రమాదం జరిగే అవకాశం కూడా నెలకొంది. ఈ పరిస్థితిని గమనించిన స్థానిక ఆటో యూనియన్ నాయకులు వెంటనే ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన ఆలస్యం చేయకుండా విపత్తు స్పందన బృందం అధికారులకు సమాచారం అందించి, తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. మాజీ కార్పొరేటర్ చొరవతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న డీఆర్ఎఫ్ బృందం ప్రమాదకరంగా రోడ్డుపై పడిన చెట్టు, కొమ్మలను యంత్రాల సహా యంతో వేగంగా తొలగించింది. దీంతో కొద్దిసేపటికే ట్రాఫిక్‌ను పూర్తిగా పునరుద్ధరించి, వాహనాల రాకపోకలను యథావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టారు. సమస్యను వెంటనే పరిష్కరించడంలో చొరవ చూపిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కు స్థానిక ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు, కాలనీవాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ఎప్పటికప్పుడు స్పందిస్తూ ముందుండటం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సలావుద్దీన్, రాజు, నరేష్ పాల్గొన్నారు.

# సర్' పై బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలి: పులి శివ కుమార్



**బాలానగర్ జలై 10 (పీపుల్స్ న్యూస్)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియపై ఏజెంట్లకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని బాలానగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పులి శివ కుమార్ గౌడ్ అన్నారు. సర్ ఉద్దేశాన్ని, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, ఈ విధానాలపై ఉన్న అపోహలను తొలగింపజేయలని ఆయన బీఎల్ఏలకు సూచించారు. గురువారం బాలానగర్ లోని రాజు కలని కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన కూకట్పల్లి నియోజకవర్గ బాలానగర్ డివిజన్ బూత్ లెవెల్ ఏజెంట్స్ (బీఎల్ఏ)లతో అవగాహన సమావేశంలో అయన ముఖ్య అధితిగా హాజరై 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)' విధి విధానాలు వివరించారు. ఈ సందర్భంగా పులి శివ కుమార్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు ఓటర్లజాబితా నుండి తొలగింపు లేకుండా చూడాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కుపై అవగాహన
పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్‌లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రేణుక, మేడ్చల్-మల్కాజ్గిరి అధికార ప్రతినిధి మధుమోహన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు యాదగిరి గౌడ్, సదానందం గౌడ్, శ్రీకాంత్ గౌడ్, రవి గౌడ్, కరోర్డినేటర్ గజానంద్ శేఖర్, మహేందర్, హాజి, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు న్యాయమైన డిమాండ్ల సాధనకు బంద్ విజయవంతం చేయాలి

- విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యాసంస్థల బంద్‌కు డీవైఎఫ్ఐ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు
- మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య




**బాలానగర్ జలై 10 (పీపుల్స్ న్యూస్)**
రాష్ట్రంలో విద్యారంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో విద్యార్థుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు రేపు చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, విద్యను రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుగా కాకుండా లాభాల కోసం నడిచే వ్యాపారంగా మార్చడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వేలాది అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని అన్నారు. విద్యార్థుల హాస్టళ్లలో నాసిరకం భోజనం, తాగునీటి కొరత, పారిశుద్ధ్య సమస్యలు, భద్రతా లోపాలు, సరిపడా వసతి లేకపోవడం వంటి సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపో వడంతో వేలాది మంది విద్యార్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు. పేద కుటుంబాలకు ఉన్నత విద్య భారంగా మారిందని, విద్యార్థులు అప్పుల పాలవుతున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. నేటి నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను బలహీనపరచే చర్యలను విరమించి, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల ని, ఖాళీ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యాలు, స్కాలర్‌షిప్ లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన ఈ బంద్ ప్రజా ప్రయోజనాల కోసమేనని, అందువల్ల విద్యార్థులు, యువజనులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్య వాదులు, ప్రజాసంఘాలు బంద్‌ను విజయవంతం చేసి తమ సంఘీభావాన్ని తెలియజేయాలని జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య పిలుపునిచ్చారు. విద్య అనేది కొందరికి అమ్ముకునే వస్తువు కాదు... ప్రతి విద్యార్థికి అందాల్సిన రాజ్యాంగ హక్కు. ఆ హక్కు పరిరక్షణ కోసమే ఈ ఉద్యమమని ఆయన పేర్కొన్నారు.

# బిఆర్ యస్ నాయకులు, రియల్ ఎస్టేట్ మండల అధ్యక్షులు, తెల్లగొర్ల లింగస్వామి నేతృత్వంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు కు ఘన సన్మానం.

**ఖమ్మం /నేలకొండపల్లి /జులై 09/(పీపుల్స్ న్యూస్ )**
నేలకొండపల్లి మండల కేంద్రంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు నేలకొండపల్లి మండలానికి విచ్చేసిన సందర్భంగా, రియల్ ఎస్టేట్ మండల అధ్యక్షులు బిఆర్ఎస్ నాయకులు తెల్లగొర్ల లింగస్వామి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బి ఆర్ఎస్ నాయకులు లింగస్వామి మాట్లాడుతూ. కరోనా టైంలో చనిపోయిన వ్యక్తులను దగ్గర ఉండి దాన సంస్కారాలు చేసిన మీ యొక్క ధైర్యం అందరికీ స్ఫూర్తిదాయకమైనది అని, మీసేవ అజరామరమైనది అని, నిరాశ్రయులను



దిక్కులేని వారిని, మతిస్థిమితం లేని వారిని, చేరదీసి, హక్కున చేర్చుకుని, వారిని పోషించి, మరల మంచి మనుషులుగా మార్చి నూతన జీవితాన్ని ఇస్తున్నారని, మానవసేవే మాధవసేవ అనే సూక్తిని మీ సేవ ద్వారా చరితార్థం చేసుకున్నారని కొనియాడారు. మీలాంటి వ్యక్తి జిల్లాలో ఉండి సేవలు అందిస్తూ మీరు చేసినటువంటి సేవలు తెలంగాణ రాష్ట్రానికి దిక్సూచిగా ఉందన్నారు. మీ సేవలు మరి ఎక్కువగా ప్రభుత్వం గుర్తించి చేయూతనివ్వాలని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జెర్రిపోతుల సత్యనారాయణ, కట్టేకోల చిన్నకృష్ణ, ఉపాధ్యాయులు ఉసిరికాయల శ్రీనివాసరావు, దండ శ్రీనివాసరావు, మాగి చక్రపాణి, పొనగాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం,
జూలై 10, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు



**పెద్దపల్లి,జూలై 9 :-**
పెద్దపల్లి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో నిర్వహించిన అండర్-17 బాల బాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్), సుల్తానాబాద్ విద్యార్థులు డి. ప్రియదర్శిని,వై.సమన్విత,బి. మణికంఠ మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నట్లు కోచ్ బొల్లి సత్యనారాయణ తెలిపారు.
ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని,రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడలను ప్రోత్సహించడంలో ఐపీఎస్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత,పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం,సతీష్,జ్యోతి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# 16వ వార్డు లో హెల్ప్ డెస్క్ పరిశీలించిన తహసిల్దార్





**నారాయణపేట, జూలై 9 )** మక్తల్ మున్సిపాలిటీ 16 వ వార్డులో సర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంలో భాగంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను గురువారంతహసిల్దార్ సతీశ్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ ఆల్కూరి పావని సైతం పాల్గొని, హెల్ప్ డెస్క్ తీరు తెన్నుల గురించి వివరించారు. సర్ ప్రక్రియ లో భాగంగా ఒక్క ఓటు కూడా కోల్పోకుండా... ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి, అవసరమైన అన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకొని, పూర్తి సమాచారం బీఎల్వోలకు అందించి, ఫారాలను నింపి, ఓటు హక్కు కోల్పోకుండా చూసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఫారాలను అందజేయాలని కోరారు. కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్కూరి రవికుమార్, స్థానిక నాయకులు రాజశేఖర్ , తౌఫిక్ అహ్మద్ , మహమ్మద్ యూసుఫ్ , నాదర్ , జావిద్ తదితరులు ఉన్నారు.

# కిష్టాపూర్ డివిజన్‌లో గృహప్రవేశ వేడుకలు

**- పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**



**మేడ్చల్, జూలై 9 :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిష్టాపూర్ డివిజన్ బ్రాడ్‌వేలో కౌన్సిలర్ ముత్యాలు గౌడ్ నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ నూతన గృహాన్ని సందర్శించి, వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అనిల్ గౌడ్ , వారి కుటుంబ సభ్యులను అభినందిస్తూ నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు.కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ తన శుభాభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా కౌన్సి లర్ ముత్యాలు గౌడ్ కుటుంబ సభ్యులు అతిథులను ఘనంగా ఆహ్వానించి సత్కరించారు. కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, కాలనీ , కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన గృహప్రవేశ వేడుకను విజయవంతం చేశారు.

# చైర్మన్ గా నమిల మహేందర్ గౌడ్.

**రాజాపేట జూలై 9**
రాజాపేట మండలం రేణికుంట పిఏసిఎస్ చైర్మన్ కార్యవర్గ సభ్యులను ప్రభుత్వ ఏపీసి సెక్రటరీ చైర్మన్ సురేందర్ మోహన్ 13 సభ్యులతో కూడిన నామినేటెడ్ సభ్యులను గురువారం ప్రకటించారు. చైర్మన్ గా రాజాపేట కు చెందిన నమిల మహేందర్ గౌడ్, గుజ్జల బాలరాజు, జంగా లక్ష్మి, భూక్యమన్య, కోరే మల్లయ్య, రాపోలు నారాయణరెడ్డి, మసిరెడ్డి సురేందర్ రెడ్డి, కోటగిరి సంతోష, జూకంటి వీరయ్య, గుడిసెల నరసింహులు, చెట్కూరి గౌరయ్య, చెక్కల బాలయ్య చిగుళ్ల చంద్రపాల్ లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 13 మందిలో 12 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కాగా ఒకరు సిపిఐ పార్టీకి చెందినవారు.



# ఖమ్మం జిల్లా అంటే వ్యవసాయం లో తెలంగాణకే తలమాణికం, ప్రతీక.

- ◆ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క.
- ◆జూలై 10న చింతకానిలో భారీ రైతు ఆశీర్వాద సభ....
- ◆3 లక్షల మంది రైతులు హాజరవుతారని అంచనా
- ◆సభకు ప్రతి రైతు హాజరై ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపు






**ఖమ్మం /చింతకాని/జూలై9(పీపుల్స్ న్యూస్ )**
జూలై 10న ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం గ్రామం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.గురువారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో డిప్యూటీ సీఎం, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి రైతు భరోసా ఆశీర్వాద సభపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అందించిన నేపథ్యంలో జూలై 10న రైతు ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మంత్రివర్గసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.
రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 3 లక్షల మంది రైతులు ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని, రైతులకు ప్రతి అడుగులో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని చెప్పారు.గత ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద పదేళ్లలో మొత్తం రూ.72 వేల కోట్లు మాత్రమే అందించిందని, తమ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా క్రింద రూ.35,830 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు.వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఒక లక్ష 67 వేల 877 కోట్లను వెచ్చించిందన్నారు. రైతు రుణమాఫీ, ధాన్యానికి బోనస్, పంటల బీమా, పంట నష్టపరిహారం, ఉచిత విద్యుత్, విద్యుత్ సబ్సిడీ, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పలు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఈ నిధులను వినియోగించినట్లు వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు.ఖమ్మం జిల్లా అంటేనే వ్యవసాయానికి ప్రతీక అని, నాగార్జునసాగర్ వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వ్యవసాయాభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, భవిష్యత్తులో రైతులకు మరింత మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తామని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడంలో మీడియా ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని, కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖమ్మం నుండి బోనకల్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు.

**- పోలీస్ కమీషనర్ సునీల్ దత్**

**ఖమ్మం/జూలై 09/(పీపుల్స్ న్యూస్ )**
రాష్ట్ర ముఖ్యమంత్రి శుక్రవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ నేపథ్యంలో ఖమ్మం,బోనకల్ ప్రధాన రహదారిపై ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమీషనర్ సునీల్ దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం, మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభకు వచ్చే రైతులు, ప్రజలు, అధికారులు, మీడియా, తదితర వాహనాలు మినహా ఖమ్మం నుండి బోనకల్ కు సాధారణ వాహనాల రాకపోకలు నిలిపివేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ ని దృష్టిలో పెట్టుకొని ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 12:00 గంటల వరకు ఆంక్షలు అమలులో వుంటాయని, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెళ్లాలని సూచించారు.ఖమ్మం నుంచి వయా పందిళ్లపల్లి, చింతకాని, బోనకల్, ఆంధ్రకు వెళ్లే వాహనాలు నేలకొండపల్లి మీదుగా వెళ్లాలని, అదేవిధంగా బోనకల్లు నుంచి ఖమ్మం వైపు వచ్చే వాహనాలు వైరా మీదుగా రావాలన్నారు. ధాంసలాపురం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దగ్గర నుంచి బోనకల్ బ్రిడ్జి వరకు సాధారణ వాహనాల రాకపోకలు అనుమతించ బడదన్నారు. హైదరాబాదు నుంచి మీటింగ్ కి వచ్చే విఐపి వాహనాలు కోదాడ, నేలకొండపల్లి, ముదిగొండ లోని వల్లపురం నుంచి మీటింగ్ స్థలం కి త్వరగా చేరుకోవచ్చు. రైతు ఆశీర్వాద సభ కు వచ్చే ప్రజల సౌకర్యార్థం వాహనాల పార్కింగ్ మార్గాలుచింతకాని మండలం, జగన్నాధపురం గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి గారి పర్యటన నేపథ్యంలో




రైతు ఆశీర్వాద సభ కు వచ్చే ప్రజల సౌకర్యార్థం, ట్రాఫిక్ రద్దీ నివారణకు మండలాల వారీగా ప్రత్యేక వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేయడమైనదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ప్రజలు తమకు కేటాయించిన మార్గంలో ప్రయాణించి, సంబంధిత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలిపివేయవల సిందిగా విజ్ఞప్తి చేశారు. తమ మండలానికి కేటాయించిన రూట్ ద్వారా మాత్రమే ప్రయాణించాలన్నారు. పోలీసు అధికారులు మరియు ట్రాఫిక్ సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలి. ప్రధాన రహదారులపై వాహనాలను నిలిపి వేయకుండా సభ విజయవంతానికి సహకరించాలన్నారు.
రూట్ నెం. 1(పార్కింగ్ నెం. 1 నుండి 5 వరకు) క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం. 1 ద్వారా వచ్చి వారికీ కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపివేయాలి.
ఖమ్మం (టౌన్ ‌ రూరల్) కామేపల్లి నేలకొండపల్లి ముదిగొండ కామేపల్లి సింగరేణి తిరుమలాయపాలెం.
రూట్ నెం. 2 (పార్కింగ్ నెం. 7, 8 మరియు 15) క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం. 2 ద్వారా రావాలి.
చింతకాని వైరా ఏన్కూరుదమ్మపేట కల్లూరు పెనుబల్లి సత్తుపల్లివేంసూరు చంద్రుగొండ
రూట్ నెం.-3 (పార్కింగ్ నెం. 10, 11, 12, 13 మరియు 14) క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం. 3 ద్వారా రావాలి. మధిర ఎర్రుపాలెం బోనకల్ ఎక్స్‌ట్రా పార్కింగ్ 9 లిప్రత్యేక పార్కింగ్ వి.వి.ఐ.పి. పార్కింగ్ - నెం. 6: వి.ఐ.పి.లు మరియు ప్రభుత్వ అధికారులు 9.

# బాలానగర్‌లో మహిళల స్వయం ఉపాధికి బాటలు.


**- -- ఉచిత కుట్టు యంత్ర శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**

**బాలానగర్ జలై 10 (పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో మహిళలు ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు యంత్ర శిక్షణ కేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి, అక్కడ జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. మహిళలకు అందుతున్న శిక్షణ నాణ్యత, శిక్షణ విధానం, వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకుని, శిక్షణ మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. బాలానగర్ డివిజన్‌లోని రాజు కాలనీలో గాంధీ విగ్రహం వద్ద ఉన్న సముదాయ భవనంలో ఈ ఉచిత కుట్టు యంత్ర శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈమేరకు బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి స్పందించిన కూకట్‌పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు తమ సొంత నిధులతో ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి, మహిళలకు ఉపాధి కల్పించే దిశగా ఒక మంచి అవకాశాన్ని అందించారు. శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా మహిళలతో ఆత్మీయంగా మాట్లాడిన ఆవుల రవీందర్ రెడ్డి, వారు శిక్షణపై వ్యక్తం చేసిన అభిప్రాయాలను తెలుసుకున్నారు. శిక్షణను పూర్తిస్థాయిలో నేర్చుకుని భవిష్యత్తులో తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని మహిళలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన ప్రతి మహిళకు గుర్తింపు పత్రంతో పాటు ఉచితంగా కుట్టు మిషను అందజేస్తామని తెలిపారు. అంతేకాకుండా, శిక్షణ అనంతరం మహిళలు స్వయం ఉపాధిని ప్రారంబి ంచి ఆదాయం పొందేలా అవసరమైన సహకారం అందిం చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు."మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే వారికి నైపుణ్యం అవసరం. నైపుణ్యం ద్వారా ఉపాధి, ఉపాధి ద్వారా ఆత్మవిశ్వాసం, కుటుంబ అభివృద్ధి సాధ్యమవుతుంది. అందుకే ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని స్వావలంబన సాధించాలని ఆయన పేర్కొన్నారు. మహిళల సాధికారత, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి కల్పన అనే లక్ష్యాలతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం బాలానగర్ డివిజన్‌లో విశేష ఆదరణ పొందుతోంది. ఉచిత శిక్షణతో పాటు కుట్టు మిషన్ పంపిణీ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలు మహిళల్లో కొత్త ఆశలు నింపుతున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, శిక్షణ కేంద్రం నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని మహిళల సంక్షేమానికి చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు.



- సర్కారు జాగా.. వేశారు పాగా...?
- సర్వే నంబర్ 108 లో 1.37 గుంటలు ప్రభుత్వం భూమి మాయం.?
- సర్వే నెంబరు మార్చి కబ్జా...
- సర్కారు జాగాలో బహుళఅంతస్తులు..
- 200కోట్ల విలువైన భూమికి ఎసరు..
- "క్లారియన్ హోటల్" కమర్షియల్ తో కబ్జా
- సర్వే చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్..

# ప్రభుత్వ భూమి హాంఫట్..



| S.No. | Name of the District | Name of the Mandal | Name of the Village | Sy.No. & Sub-Division (If any) | Plot No. | Town Sy.No. (If applicable) | House No. (If applicable) | Extent in Sq.Yards (Ac.- Gts) | State Government/ Central Government |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 38 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 91 | - | - | - | 164560 (34-00) | GPRA Quarters - Cental Government |
| 39 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 91 | - | - | - | 242000 (50-00) | JNIDB - Central Government |
| 40 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 91 | - | - | - | 183073 (37-33) | Soceity (Lease) - State Government |
| 41 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 91 | - | - | - | 93170 (19-10) | EPTRI - Central Government |
| 42 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 91 | - | - | - | 60500 (12-20) | Training Academy - State Government |
| 43 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 91 | - | - | - | 1270.5 (0-10.5) | Home Dept - State Government |
| 44 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 91 | - | - | - | 605 (0-05) | RIO - Central Government |
| 45 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 91 | - | - | - | 14520 (3-00) | Registration Dept - State Government |
| 46 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 94/1 | - | - | - | 121 (0-01) | Khariz Khata - State Government |
| 47 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 94/3 | - | - | - | 968 (0-08) | Kancha - State Government |
| 48 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 94/4 | - | - | - | 726 (0-06) | Kancha - State Government |
| 49 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 94/5 | - | - | - | 484 (0-04) | Poramboke - State Government |
| 50 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 94/6 | - | - | - | 121 (0-01) | Sarkari - State Government |
| 51 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 94/8 | - | - | - | 726 (0-06) | Kancha Sarkari - State Government |
| 52 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 94/11 | - | - | - | 726 (0-06) | Poramboke - State Government |
| 53 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 104 | - | - | - | 7986 (1-26) | APHB - Housing - State Government |
| 54 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 107 | - | - | - | 52514 (10-34) | APHB - Housing - State Government |
| 55 | Ranga Reddy | Serilingampally | Gachibowli | 108 | - | - | - | 9317 (1-37) | APHB - Housing - State Government |

DC & TAHSILDAR SERILINGAMPALLY MANDAL — REVENUE DIVISIONAL OFFICER RAJENDRANAGAR DIVISION — ADDL.COLLECTOR (REV.) RANGAREDDY DISTRICT — COLLECTOR RANGAREDDY DISTRICT







**శేరిలింగంపల్లి : జూలై 9 (పీపుల్స్ న్యూస్)**

స్థానిక శేరిలింగంపల్లి మండలం పరిధిలోని, అత్యంత ఖరీదైన స్థలం కబ్జా విషయమై అధికారులు నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారు. కబ్జాకు గురైందని ప్రచారంలో ఉన్న ప్రభుత్వ స్థలం అసలు కబ్జాకు గురైందో...లేదో తేల్చడానికి తటపటాయిస్తు, కాలయాపన చేస్తుండటంతో అధికారుల తీరుపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. తాజాగా రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండల పరిధిలోని, గచ్చిబౌలి సర్వే నెంబరు 108, 110 ప్రభుత్వ స్థలములో ఓ ప్రయివేటు నిర్మాణ దారుడు తప్పుడు సర్వే నెంబరు ( 111) చూపించి, బహుళ అంతస్థుల నిర్మాణం చేపట్టి వాణిజ్య సముదాయాలు ఏర్పరచి కొనసాగిస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే స్థలంలో గతంలో సర్వే చేసిన అధికారులు ఇది సర్వే నెంబరు 108, 110 అని నిర్ధారించినా అధికారుల అలసత్వమో, నిర్లక్ష్యంతో ఆ బహుళ అంతస్థుల వాణిజ్య సముదాయం ఎటువంటి ఆటంకం లేకుండా కొనసా గుతోంది. ఈ విషయంపై సదరు అక్రమ నిర్మాణదారుడు ప్రముఖ న్యాయస్థానాన్ని సంప్రదించినట్లు, అధికారులను మ్యానేజ్ చేసుకుంటూ వస్తున్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు అక్రమ నిర్మాణదారుడికి సర్వే నెంబరులో భూమి లేదని, నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిలో కబ్జాలకు నడుం కట్టాడడనే విమర్శలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి. ఈవిషయమై, సదరు నిర్మాణదారుడు జీఓ 59 కి దరఖాస్తు చేసుకోగా, అప్పటి తహశీల్దార్ నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో, సదరు నిర్మాణదారుడి దరఖాస్తును కొట్టివేసి, ప్రభుత్వ స్థలం రెగులరైజేషన్ కి నిరాకరించి ఆస్థలాన్ని నిషేషేధిత జాబితాలో ఉంచాలని, ఆర్డీఓ కి లేఖ రాసినట్లు సమాచారం. అయినా సదరు అక్రమ నిర్మాణదారుడు స్థానిక అధికారుల నిబంధనలు తుంగలో తొక్కి, అందులో "క్లారియన్" పేరుతో హోటల్" నిర్వహిస్తు, సొమ్ముజేసుకు ంటున్నారు. ఇంతటి నిర్మాణం, వాణిజ్య సముదాయంతో సదరు అక్రమ నిర్మాణదారుడి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వ రెవిన్యూ ఉన్నతాధికారులు స్పందించి, సదరు సర్వే నంబరు తారుమారు చేసి కమర్షియల్ భవనం నిర్మించిన అక్రమార్కుల పై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉందీ.



# కేరళ ఓనం బంపర్ లాటరీ ఫస్ట్ ప్రైజ్ రూ.30కోట్లకు పెంపు టికెట్ ధర ఎంతంటే



**కేరళ :** లాటరీలపై ఆసక్తి ఉన్నవాళ్లకు గుడ్ న్యూస్. కేరళ రాష్ట్ర లాటరీ శాఖ ఈ ఏడాది ఓనం బంపర్ లాటరీని అధికారికంగా ప్రకటించింది. మొదటి బహుమతి కింద రూ.30 కోట్ల ఇవ్వనున్నట్లు తెలిపింది. అయితే టికెట్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదని స్పష్టం చేసింది.దేశంలోనే హయ్యెస్ట్ ప్రైజ్ మనీగతంలో కేరళ ప్రభుత్వం మొదటి బహుమతి కింద రూ.25 కోట్లు ఇచ్చింది. తాజాగా దీనిని రూ.30 కోట్లకు పెంచుతూ అధికారిక ఉత్త ర్వులు జారీ చేసింది. ఇతర బహుమతుల విష యంలోనూ పలు మార్పులు చేసింది. గతంలో రూ.50 లక్షలుగా ఉన్న థర్డ్ ప్రైజ్‌ను రూ.25 లక్షలకు తగ్గించింది. టికెట్ ధర మాత్రం ఎప్పటిలానే రూ.500గా ఉంచింది. ఇందులో బేస్? ప్రైస్? రూ.357.14, దీనికి 40 శాతం జీఎస్టీ అదనం.కేరళ లాటరీ డైరెక్టర్ అంజు కేఎస్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఓనం బంపర్? లాటరీ అధికార కార్యక్రమాన్ని జులై 17న ముఖ్యమంత్రి వీడీ సతీశన్? ప్రారంభిస్తారు. గుర్తింపు పొందిన ఏజెంట్లకు పంపిణీ చేయడం కోసం డిపార్ట్?మెంట్ మొదటిగా 90 లక్షల టికెట్లను ప్రింట్ చేయాలని నిర్ణయించింది. డ్రా తేదీ దగ్గర పడేకొద్దీ మార్కెట్ డిమాండ్?ను బట్టి మరిన్ని టికెట్లను ప్రింట్ చేసే అవకాశం ఉంది. ఈ టికెట్లను ౫౫, ౧దీ, ౧జ, ౧ణ, ౧జు, ౧+, ౧౧, ౧జీ, ౧ఖ, ౫ూ అనే 10 సిరీస్‌లలో విడుదల చేస్తాం. విజేతలకు పంపిణీ చేయడం కోసం మొత్తం రూ.125.54 కోట్ల భారీ బహుమతి పూల్‌ను కేటాయించారు. సెప్టెంబర్ 26న రాజధాని తిరువనంతపురంలో ఈ లాటరీ డ్రా తీస్తారు.బహుమతుల వివరాలుఫస్ట్ ప్రైజ్ కింద రూ.30 కోట్లు ఇస్తారు. రెండో బహుమతి కింద 20 మందికి (ప్రతి సిరీస్? నుంచి ఇద్దరు విజేతలకు) తలో రూ.1 కోటి చొప్పున అందిస్తారు. మూడో బహుమతి కింద 20 మంది తలో రూ.25 లక్షలు, నాలుగో బహుమతి కింద 10 మందికి (ప్రతి సిరీస్‌కు ఒకరు) రూ.5 లక్షలు చొప్పున అందజేస్తారు. ఐదో బహుమతి కింద 10 మందికి రూ.2 లక్షలు చొప్పున, ఆరో బహుమతిగా 54వేల మందికి రూ.5000 చొప్పున, ఏడో బహుమతి కింద 81వేల మందికి రూ.2000 చొప్పున, ఎనిమిదో బహుమతి కింద 1,24,200 మందికి రూ.1000 చొప్పున, తొమ్మిదో బహుమతి కింద 2,75,400 మందికి రూ.500 చొప్పున అందిస్తారు. ఇవే కాకుండా, మిగిలిన సిరీస్?ల్లో ఒకే అదృష్ట సంఖ్య కలిగిన తొమ్మిది మందికి కన్సోలేషన్ ప్రైజ్‌గా రూ.5 లక్షల చొప్పున ఇస్తారు.నో ఆన్?లైన్ టికెట్స్?అయితే ప్రజల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ వల్ల ఆన్?లైన్ మోసాలు జరగకూడదనే ఉద్దేశంతో దీనిని టికెట్లను ఆన్?లైన్?లో విక్రయించడాన్ని నిషేధించారు. ఒక వేళ ఆన్?లైన్?లో టికెట్ విక్రయాలు చేస్తే అది చట్టవిరుద్ధమని, శిక్షార్హమని పేర్కొన్నారు. కేవలం లైసెన్స్? పొందిన ఏజెట్లు, రిటైల్ విక్రేతల ద్వారా మాత్రమే ప్రింటెడ్? టికెట్లు కొనాలని స్పష్టం చేశారు. సోషల్ మీడియా, డిజిటల్ పేమెంట్ లింక్?ల ద్వారా ఆన్?లైన్ బుకింగ్ కోసం డబ్బులు పంపవద్దని హెచ్చరించారు. ఈ లాటరీ విక్రయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని 'కారుణ్య బెనవలెంట్ ఫండ్' లాంటి కీలక ప్రజా సంక్షేమ, ప్రజారోగ్య పథకాలకు ఉపయోగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గతేడాది ఓనం బంపర్ లాటరీకి వచ్చిన అద్భుతమైన స్పందనను బట్టి, ఈ సీజన్‌లో కూడా ప్రజల నుంచి మరింత భారీ రెస్పాన్స్ వస్తుందని కేరళ లాటరీ శాఖ భావిస్తోంది.

# అక్రమ భవనాలు, నిర్మాణాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు




**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు, సురక్షితం కాని భవనాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదకరంగా ఉండి, విపత్తు లకు దారితీసే భవనాలను కూల్చివేయడం లేదా మూసివేయడంపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని ఢిల్లీ, గురుగ్రామ్, లఖ్‌నవూ, పాట్నా, తమిళ నాడుకు చెందిన ఆయా మున్సిపల్ ఉన్నతా ధికారులను ఆదేశించింది. ఢిల్లీలోని సాకేత్‌లో ఇటీవల భవనం కూలిన విషాద ఘటన సహా లఖ్‌నవూ(యూపీ)లోని మాల్వీయా నగర్, అలీగంజ్‌లలో జరిగిన అగ్నిప్రమాదాలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. మే 20న కోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఎలాంటి చర్యలు చేపట్టారో న్యాయస్థానం ముందుంచాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆగస్టు 4న జరిగే తదుపరి విచారణకు సంబంధిత అధికారులు స్వయంగా హాజరు కావాలని పేర్కొంది.సాకేత్, మాల్వీయా నగర్, లజపత్ నగర్‌లలో కాలపరిమితితో కూడిన క్షేత్రస్థాయి సర్వే నిర్వహించేందుకు ఐఐటీ ఢిల్లీకి చెందిన ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు, ఇద్దరు డ్రాఫ్ట్స్‌మెన్‌లతో కూడిన ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాల ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ బృందంలో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్( అధికారులు కూడా ఉంటారు. ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలోకి వచ్చే సరోజినీ నగర్‌లోనూ ఇదే తరహా చర్యలు చేపట్టనున్నారు. ఈ ప్రక్రియలో కమిటీ ఎలాంటి ం వహించకూడదని, నిజాయతీతో కూడిన నివేదికను సమర్పించాలని కోర్టు స్పష్టం చేసింది.

# ఏక్‌నాథ్ షిండేతో శరద్ పవార్ భేటీ.. ఉద్ధవ్ టీమ్‌లో టెన్షన్



**ముంబై:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేతో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ సమావేశమయ్యారు. వారిద్దరూ కొంతసేపు ఏకాంతంగా చర్చించుకున్నారు. దీంతో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)తో కూడిన ప్రతిపక్ష ఎంవీఏ కూటమిలో ఇది కల కలం రేపింది. మహారాష్ట్ర–కర్ణాటక సరిహద్దు వివాదంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అధ్యక్షతన బుధవారం కీలక సమావేశం జరిగింది. మహారాష్ట్ర అసెంబ్లీలో జరిగిన ఈ సమావేశంలో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ పాల్గొన్నారు.కాగా, ఈ కార్యక్రమం తర్వాత అసెంబ్లీలోని డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే కార్యాలయానికి శరద్ పవార్ వెళ్లారు. కేబినెట్ సమావేశంలో పాల్గొన్న షిండే ఈ విషయం తెలుసుకున్నారు. కేబినెట్ సమావేశాన్ని మధ్యలోనే ముగించుకుని తన కార్యాలయానికి వెళ్లారు. అక్కడ వేచి ఉన్న శరద్ పవార్‌కు పూలగుత్తితో స్వాగతం పలికారు. వారిద్దరూ సుమారు 15 నిమిషాలపాటు మాట్లాడుకున్నారు. కేవలం 'మర్యాదపూర్వక భేటీ' అని షిండే కార్యాలయం పేర్కొంది. అయితే షిండేతో శరద్ పవార్ భేటీ కావడం రాజకీయ ఊహాగానాలకు ఆజ్యం పోసింది. శరద్ పవార్ పార్టీలోని ఒక వర్గం ఎన్డీయే కూటమిలో చేరడానికి ఆసక్తి చూపుతోందన్న ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది.మరోవైపు ఎన్సీపీ (ఎస్పీ)కి మిత్రపక్షమైన శివసేన (యూబీటీ) తీవ్రంగా విమర్శించింది. షిండే కార్యాలయానికి శరద్ పవార్ స్వయంగా వెళ్లడంపై ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ మండిపడ్డారు. 'షిండేను ఆయన కార్యాలయంలోనే కలవాల్సిన అవసరం ఏముంది?' అని ప్రశ్నించారు. ఎన్సీపీ (ఎస్పీ) విశ్వసనీయతను ఈ చర్య దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

# యువతను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు కుట్ర- దేశవ్యాప్తంగా ఎన్ఐఏ దాడులు- 11 మంది అరెస్టు




**న్యూ ఢిల్లీ :** ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కేంద్ర ప్రభు త్వాన్ని కూలదోసి, జిహాద్ ద్వారా ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించాలనే కుట్రలపై జాతీయ దర్యాప్తు సంస్థ–చీ×ూ దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్, బిహార్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల తోపాటు దిల్లీలోని మొత్తం 20ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు కీలక డిజిటల్ పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ ఉగ్రవాదానికి సంబంధించిన కేసులో చీ×ూ ఇప్పటివరకు 11మంది నిందితులతోపాటు ఓ బాలుడిని అరెస్టుచేసింది. మార్చిలో ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో విజయవాడ పోలీసులు సోదాలు నిర్వహించగా ఐసిస్, అల్–ఖైదాలకు చెందిన కీలకపత్రాలు లభ్యమయ్యాయి. మే నెలలో ఈ కేసు దర్యాప్తును చీ×ూ చేపట్టింది. నిందితుల కాల్ డేటా, సీజ్ చేసిన పరికరాల విశ్లేషణ ఆధారంగా ఈ సోదాలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.జీశాన్ ఇంట్లో నాలుగు గంటల పాటు సోదాలుఐసిస్ సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై జోధ్‌పుర్‌లో జీశాన్ అనే యువ కుడిని గతంలో ఆంధ్రప్రదేశ్ ఉగ్రవాద నిరోధక బృందం అరెస్టు చేసింది. ఇటీవల ఈ కేసును ఎన్ఐఏకు బదిలీ చేశారు. ఇందులో భాగంగా బుధవారం ఎన్ఐఏ బృందం జోధ్‌పుర్‌కు చేరుకుని అతని ఇంట్లో సోదాలు నిర్వహించిం ది. నిందితుడి నివాసంలో అధికారులు మూడు నుంచి నాలుగు గంటల పాటు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అతని కుటుంబ సభ్యులను సుదీర్ఘంగా విచారించి కీలక వివరాలు సేకరిం చారు. నిందితుడు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.ఈ ఏడాది మార్చిలో ఏపీ ఏటీఎస్ అధికారులు జీశాన్?ను అరెస్టు చేసారు. ఆ సమయంలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. జీశాన్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ఐసిస్ హ్యాండ్లర్‌తో నిరంతరం టచ్?లో ఉన్నట్లు తేలింది. జోధ్‌పుర్‌లో ఐసిస్ నెట్‌వర్క్ గ్రూప్‌ను నడిపించే బాధ్యతను అప్పగించే ముందు, ఆ హ్యాండ్లర్ జీశాన్‌కు ఒక పరీక్ష నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. అందులో పాస్ అయిన తర్వాతే అతనికి గ్రూప్ అడ్మిన్ బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తోంది.ఏపీలోని విజయవాడలో ఒక అనుమానితుడిని పోలీసులు అరెస్ట్ చేయడంతో ఈ నెట్‌వర్క్ గుట్టు రట్టయింది. విజయవాడలో తన సహచరుడు పట్టుబడినట్లు తెలియగానే జీశాన్ వెంటనే ఆ సోషల్ మీడియా గ్రూప్ నుంచి ఎగ్జిట్ అయ్యాడు. అయినప్పటికీ, పోలీసుల దర్యాప్తులో అతని లింకులు స్పష్టంగా బయట పడటంతో ఏపీ జోధ్‌పుర్ వచ్చి స్థానిక పోలీసుల సహాయంతో అతడిని అరెస్ట్ చేశారు.

# భారతీయ పరిశ్రమలపై చైనా గుత్తాధిపత్యం



**న్యూ ఢిల్లీ :** భారతదేశంలోని అత్యంత కీలకమైన పరిశ్రమలను చైనాకు అప్పగించడం ద్వారా మోదీ సర్కార్? జాతీయ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కీలక రంగాలను చైనాకు అప్పగించి, చైనీయులు మరింతగా వృద్ధి చెందడానికి పలు అవకాశాలు కల్పించిందని విమర్శించారు. చైనా ఇప్పటికీ భారత వ్యూహాత్మక పరిశ్రమలను శాసిస్తోందని ఒక మీడియా ఇచ్చిన రిపోర్టును ఆధారంగా చేసుకొని ఖర్గే, మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అయితే కాంగ్రెస్ చేసిన ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి కానీ, బీజేపీ నుంచి కానీ స్పందన రాకపోవడం గమనార్హం.చైనాకు మోదీ క్లీన్ చిట్ఆరేళ్ల క్రితం గల్వాన్ లోయలో 20 మంది భారత వీర జవాన్లు ప్రాణత్యాగం చేసిన తర్వాత ప్రధాని మోదీ చైనాకు క్లీన్ చిట్ ఇచ్చారని ఖర్గే ఆరోపించారు. "మన వీరజవాన్లు మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించారు. కానీ మోదీ ప్రభుత్వం భారతదేశ ప్రయోజనాలను చైనాకు తాకట్టు పెట్టింది" అని ఖర్గే ఎక్స్? వేదికగా విమర్శలు గుప్పించారు. దేశ భవిష్యత్తును నిర్దేశించాల్సిన మన ఆర్థిక వ్యవస్థలోని అత్యంక కీలక రంగాలు చైనాపై ఆధారపడడం పెరిగిపోయిందని అన్నారు. గల్వాన్ ఘర్షణ తర్వాత చైనా నుంచి దిగుమతులు 2025–26 నాటికి 101.81 శాతం పెరిగిందని, దీని వల్ల భారత వాణిజ్య లోటు 112.1 బిలియన్ డాలర్లకు చేరిందని ఖర్గే తెలిపారు. "భారతదేశ ం దిగుమతి చేసుకునే యాంటీబయాకిట్స్‌లో 86 శాతం చైనా నుంచే రావడం ఆశ్చర్యకరం. 2024–25లో భారతదేశం దిగుమతి చేసుకున్న ఏపీఐ, బల్క్? డ్రగ్?, డ్రగ్ ఇంటర్మీడియట్లలో దాదాపు 74 శాతం చైనా చేతిలోనే ఉన్నాయి" అని ఖర్గే చెప్పారు. ఇక భారత్ దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాల (ఈవీ) విడిభాగాల్లో 66 శాతం ఇప్పటికీ చైనా నుంచే వస్తున్నాయని అన్నారు.భారత ఈవీలకు శక్తినిచ్చే లిథియం–అయాన్ బ్యాటరీల్లో దాదాపు 75 శాతం దిగుమతి అవుతున్నాయని, వాటిలో అత్యధిక భాగం చైనావేనని ఖర్గే చెప్పారు. అలాగే 2025–26లో భారతదేశం దాదాపు 93 శాతం పర్మనెంట్ మాగ్నెట్‌లను చైనా నుంచే దిగుమతి చేసుకుందని ఆయన అన్నారు. సౌరశక్తిపై మోదీ ప్రభుత్వం చేస్తున్న డొల్ల ప్రసంగాలు ఒక వైపు ఉంచితే, ఆత్మనిర్భర్ భారత్ కింద మోదీ ప్రోత్సహిస్తామని చెప్పుకుంటున్న ఓ రంగం పూర్తిగా చైనా వశమైందని అన్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకున్న అన్‌డిఫ్యూజ్డ్‌సిలికాన్ వేఫర్లలో 99 శాతానికి పైగా చైనా సరఫరా చేయడం తీవ్ర దిగ్భ్రాంతికరం. ఇది ఆ రంగాన్ని దాదాపుగా చేక్కించుకోవడమే. ఈ అన్‌ఫ్యూజ్డ్ సిలికాన్ వేఫర్లే మన సోలార్ సెల్స్?కు ఆధారంగా మారాయని ఖర్గే పేర్కొన్నారు.జూలా ఫ్రెండ్ కోసం ఎర్రతివా"చైనా నేరుగా అరుణాచల్ ప్రదేశ్, లద్దాఖ్‌లలో చైనా భారత భూభాగంలోకి చొరబడుతోందని ఉందని పౌర సమాజం నివేదికలు చెబుతున్నాయి. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం తన 'జూలా ఫ్రెండ్' కోసం ఎర్ర తివాచీ పరిచింది. భారతదేశ ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్టులకు నాలుగు చైనా కంపెనీలు బిడ్లు వేసేందుకు వీలుగా ఆంక్షలు తొలగించింది" అని మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

# బీజేపీని ఓడించేందుకు డీఎంకే, టీవీకే ఏకం కావాలి



**చెన్నై:** తమిళనాడుకు చెందిన వీసీకే అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ స్థాయిలో బీజేపీని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే డీఎంకే, టీవీకే పార్టీలు 'ఇండియా' కూటమిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం అరియలూరులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడులో పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, బీజేపీ మతతత్వ రాజకీయాలను అడ్డుకోవడానికి ఒక ఐక్య కూటమి అవసరమని అన్నారు. ప్రాంతీయ సమస్యల కంటే బలమైన బీజేపీ వ్యతిరేక కూటమిని నిర్మించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 'స్థానికంగా టీవీకే, డీఎంకే పరస్పర వ్యతిరేక వైఖరి కలిగి ఉన్నప్పటికీ, బీజేపీని ఓడించడానికి ఆ రెండు పార్టీలూ 'ఇండియా' కూటమిలో భాగం కావాలన్నదే నా జాతీయ స్థాయి దృక్పథం' అని అన్నారు. పార్టీల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడానికి రాజకీయ పరిణతి అవసరమని చెప్పారు.కాగా, 'ఇండియా' కూటమిలో ఇటీవల తలెత్తిన ఘర్షణలను తిరుమావళవన్ ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మార్చుకోవాలని ఆయన సూచించారు. ఆ పార్టీ అనుసరించిన వ్యూహాలు తమిళనాడులోని డీఎంకే, పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ వంటి ప్రాంతీయ మిత్రపక్షాలతో విభేదాలు సృష్టించాయని, అలాగే కేరళలోని వామపక్షాలతో సంబంధాలు దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. మొత్తంగా, స్థానిక రాజకీయ విభేదాల కంటే బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత ప్రతిపక్ష ఐక్యతకే ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.

# 'భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని నేనే ఆపేశా'



**అమెరికా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌మళ్లీ పాత పాటే పాడుతున్నారు. గతంలో తన చొరవవల్లే భారత్–పాకిస్థాన్ యుద్ధం ఆగిందంటూ గొప్పలు చెప్పుకొంటున్నారు. ఎయిర్ ఫోర్స్ వన్ () లో ప్రయాణిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడాది మే నెలలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో 11 విమానాలు కూలిపోయినట్లు చెప్పారు. అయితే అవి భారత్‌వా, పాక్‌వా..? లేదంటే రెండు దేశాలకూ చెందినవా అన్నదానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.తన జోక్యంవల్లే ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలు ఆగాయని ట్రంప్ చెప్పారు. నోబెల్ శాంతి బహుమతి కూడా తనకే రావాల్సి ఉన్నప్పటికీ ఇవ్వలేదంటూ ఆక్షేపించారు. మరోవైపు పాకిస్థాన్ విషయంలో మూడో దేశం జోక్యాన్ని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంది. ఆపరేషన్ సింధూర్ సమయంలోనూ అమెరికా మధ్యవర్తిత్వం ఏమీ లేదని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో మిలిటరీ చర్యను నిలిపివేసినట్లు పేర్కొన్నది.అయితే ట్రంప్ మాత్రం ఈ అంశాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు తాపత్రయపడుతున్నారు. తాను కలుగజేసుకోకపోయి ఉంటే ఇరు దేశాల మధ్య 'అణు యుద్ధం' వచ్చేదని అన్నారు.

# వయనాడ్ దుర్ఘటనలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య



**కేరళ:** కేరళలోని వయనాడ్‌లో కల్లాడి సొరంగం నిర్మాణస్థలంలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో మూడోరోజు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గురువారం మరో రెండు మృతదేహాలను రెస్క్యూ బలగాలు వెలికి తీశాయి. దీంతో ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 6కు చేరింది. గాలింపు ప్రాంతంలోని జోన్–1లో ఒక మృతదేహాన్ని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మరోక మృతదేహాన్ని నది సమీపంలో కనుగొన్నట్లు తెలిపారు. మిగతా జోన్లలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అలాగే నది పరివాహక ప్రాంతాల్లోనూ సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇంకా ముగ్గురు వ్యక్తుల ఆచూకీ దొరకాల్సి ఉంది. వారి కోసం రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అటు గాయపడిన పది మందిలో ముగ్గురు కొలుకోని ఆస్పత్రికి నుంచి డిశ్చార్జ్ అయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు.వయనాడ్? ఘటనపై విపక్షాల ఆరోపణలుఅయితే, వయనాడ్? ఘటనకు సంబంధించి కేరళ ప్రభుత్వంపై విపక్షాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. సహాయక చర్యలపై దృష్టి పెట్టకుండా యూడీఎఫ్ ప్రభుత్వం ఈ విషయాన్ని రాజకీయం చేస్తోందని ప్రతిపక్ష సీపీఐ(ఎం) గురువారం ఆరోపించింది. మంత్రులు, అధికారుల పరస్పర విరుద్ధ ప్రకటనలు, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయని విమర్శించింది. వయనాడ్? ఘటన తీవ్రమైన పరిపాలనా వైఫల్యాలను బయటపెట్టాయని ఆరోపించింది. బాధ్యతల నుంచి తప్పించుకుంటూ, ఈ విపత్తును రాజకీయ వివాదంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. అయితే, విపత్తుకు గల కారణాలపై మంత్రులు చేసిన భిన్నాభిప్రాయాలను వార్తా కథనంలో ప్రస్తావించింది."సహజంగా కొండచరియలు విరిగిపడటం వల్ల కాకుండా, తవ్విన మట్టిని తప్పుగా డంప్ చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని వయనాడ్ ఇన్‌ఛార్జ్ మంత్రి సిద్ధఖీ తెలిపారు. కొండ వాలు వల్ల కాకుండా, డంప్ చేసిన మట్టి కూలిపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ముఖ్యమంత్రి వీ.డీ. సతీశన్ కూడా పేర్కొన్నారు" అని సీపీఐఎం పేర్కొంది. అయితే, రెవెన్యూ మంత్రి ఎ.పీ. అనిల్ కుమార్ తర్వాత స్పందిస్తూ, వాస్తవానికి కొండచరియలు విరిగి ఈ విపత్తుకు కారణమని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## గందరగోళంలో వ్యవసాయం




ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటికే వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరు గుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టు మిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎల్‌కనినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన డంతో రైతు కుదేలవుతున్నాడు. మరోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకో వాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెక్కేందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.



# మరోమారు కలవర పెడుతున్న కోవిడ్

**రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి**

**అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ**



**తిరుపతి,జూలై9:** కోవిడ్ మరోమారు కలవర పెడుతోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కొవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కొవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్టు సమాచారం.కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి (52) తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. నిమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కొవిడ్ పరీక్ష చేయగా 26వ తేది పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్యశాఖ అప్రమత్త మైంది. కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశిచ్చారు. రుయాలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటుచేశాం. కొవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నాం. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదుకాలేదు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం. కరోనాతో గతంలో లాగా భయపడాల్సిన పనిలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# తాడిచర్ల-2 కేటాయింపు కిషన్ రెడ్డి కృషి ఫలితమే

**యూపిఎ హయాంలో**

**కేటాయింపు అవాస్తవం**

**భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి**

**ఎమ్మెల్యే పాయల శంకర్**



**న్యూఢిల్లీ,జూలై9:** తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌అన్నారు. యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాల తో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# ట్రంప్ మెడకు లైంగిక వేధింపుల కేసు

**దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు**

**కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్**

**డాలర్లు చెల్లించాలని ఆదేశం**



**వాషింగ్టన్,జూలై9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధిపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌నకు సంబంధించిన ఏకైక సివిల్ కేసు కాదు. 2024లో పరువు నష్టం కేసులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ కేసు కూడా ప్రస్తుతం న్యాయపరమైన ప్రక్రియలో కొనసాగుతోంది.

## గరుడ పురాణాన్ని ఇంట్లో ఉంచుకోవచ్చా? మరణానంతరం మాత్రమే చదవాలా? నిజమెంత?

అష్టాదశ పురాణాల్లో గరుడ పురాణానికి ఎంతో ప్రత్యేకత ఉంది. శ్రీమహావిష్ణువు తన వాహనమైన గరుత్మంతునికి బోధించిన వైష్ణవ పురాణమే గరుడ పురాణం. ఇందులో మొత్తం 18,000 శ్లోకాలు ఉన్నాయి. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు చేయాల్సిన కర్మలు, ఆచారాల గురించి ఇందులో వివరించబడింది. గరుడ పురాణం ఎక్కువగా మరణానంతర విషయాలకు సంబంధించిన సమాచారాన్ని కలిగి ఉండడం చేత మిగిలిన పురాణాల మాదిరిగా ఈ పురాణాన్ని ఇంట్లో ఉంచుకోవచ్చా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ అంశంపై మరింత సమగ్రంగా తెలుసుకోవాలంటే ఈ కథనాన్ని పూర్తిగా చదవాల్సిందే!



**గరుడ పురాణం విశిష్టత**

వ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాల్లో గరుడ పురాణం కూడా ఒకటి. ఈ గరుడ పురాణంలో ఒక వ్యక్తి చనిపోయినప్పుడు, తాము చేసిన పనులను బట్టి ఎలాంటి శిక్షలు అనుభవిస్తారో వివరించబడింది. అంతేకాదు మనం పుట్టినప్పటి నుంచి మరణించే వరకు ఏమేమి జరుగుతాయనే పూర్తి వివరాలు గరుడ పురాణంలో ఉన్నాయని పండితులు చెబుతారు. మనం మరణించిన తర్వాత మన ఆత్మ ఎక్కడికి వెళ్తుందనే వివరాలను కూడా పొందుపరిచారు. అసలు గరుడ పురాణం మామూలు వ్యక్తులు చదవచ్చా? చదవాలంటే ఎలాంటి నియమాలు లి? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

గరుత్మంతునికి శ్రీ మహావిష్ణువు బోధించిన గరుడ పురాణం పేరుకు పురాణం అయినప్పటికీ మిగతా పురాణాలు చదివినంత తేలికగా, ఆసక్తిగా గరుడ పురాణం చదవడానికి చాలా మంది ఇష్టపడరు. అందుకు కారణం గరుడ పురాణం పట్ల ప్రచారంలో ఉన్న అపోహలే అని చెప్పవచ్చు. ఈ పురాణం లోని సందేహాలను తీర్చడానికి శ్రీమహావిష్ణువు చెప్పే సమాధా నాలుగా కనిపిస్తాయి.

**మరణానంతరం మాత్రమే చదవాలా?**

పురాణాల ప్రకారం, గరుడ పురాణాన్ని కుటుంబ సభ్యుల మరణం తర్వాత మాత్రమే పారాయణ చేస్తారు. చనిపోయిన వారి ఆత్మ 13 రోజుల పాటు ఇంట్లో ఉంటుందని నమ్ముతారు. అందుకే ఈ సమయంలో గరుడ పురాణం చదవం వల్ల చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని, మోక్షం లభిస్తుందని పండితులు చెబుతారు.

**గరుడ పురాణంలోని ముఖ్యాంశాలు**

గరుడ పురాణంలో మరణించిన వ్యక్తి దేహాన్ని వదిలిన తరువాత ఆత్మ ప్రయాణం ఎలా సాగుతుంది? ఆ సమయంలో జీవికి ఎదురయ్యే పరిస్థితులు ఈ పురాణంలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఈ కారణంగా కొన్ని ప్రాంతాల్లో, కొన్ని కుటుంబాల్లో శ్రాద్ధ సమయాల్లో గరుడ పురాణం చదవడం ఆనవాయతీగా వస్తోంది.

**మరణించిన వారికి ఉత్తమ గతులు**

ఇంట్లో ఎవరైనా మరణించిన సందర్భాల్లో గరుడ పురాణం చదవడం వల్ల చనిపోయిన తమ కుటుంబ సభ్యులకు ఉత్తమగతులు కల్పించడానికి ఎలాంటి ఆచార వ్యవహారాలు పాటించాలి? ఎలాంటి విధులు నిర్వహించాలి అనే విషయాల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది. నిజానికి ఈ విషయాలన్నీ ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసినవే!

**మరుగున పడుతున్న నిజాలు**

ప్రస్తుత కాలంలో ఎవరైనా చనిపోయినప్పుడు గరుడపురాణం చదవాలనే విషయం మరుగున పడిపోయింది. ఎందుకు వచ్చిందో, ఎలా వచ్చిందో తెలియదు కానీ, గరుడ పురాణం చదవడం వలన ఎవరైనా మరణిస్తారేమో అనే సందేహం ప్రచారంలోకి వచ్చింది. ఈ కారణంగానే గరుడ పురాణం ఇంట్లో ఉంచుకోవడం అశుభం అనే భావన ప్రతి ఒక్కరిలో పెరిగి పోయింది. అందుకే ఎంతో గొప్పదైన గరుడ పురాణం ఎవరి ఇంట్లో కనిపించకుండా పోయింది. ఎవరి నోటా వినిపించకుండా పోయింది.

**పండితులు ఏమి చెబుతున్నారు?**

పరలోకంలో ఆత్మగా జీవుడు కొనసాగించే యాత్ర గురించి అందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే వ్యాసభగవానుడు రచించిన పురాణం కాబట్టి నిస్సందేహంగా ఈ పురాణాన్ని అందరూ ఇంట్లో ఉంచుకుని చదువుకోవచ్చని పండితులు చెబుతున్నారు.

**గరుడ పురాణం నిషేధించిన కర్మలు**

కొన్ని విషయాలను పాపాలని గరుడ పురాణం చెబుతోంది. అవి బ్రహ్మహత్య, శిశుహత్య, గో హత్య, స్త్రీ హత్యల వంటివి. అలాగే రహస్యంగా పాపపు పని చేసేవారు, గురువులు, పండితులు, దేవతలు, స్త్రీ, శిశు ధనం హరించేవారు కూడా నరకంలో శిక్షలను అనుభవించక తప్పదంటుంది. అలాగే పుణ్యతీర్థాలను, సజ్జనులను, సత్కర్మలను, గురువులను, దేవతలను నిందించేవారు యమలోకంలో దక్షిణపు మార్గాన నడవాల్సి ఉంటుందట.

**భయంకర పాపాలు ఇవే!**

పురాణాలను, వేదాలను, మీమాంస, న్యాయశాస్త్రాలను, వేదాంత శాస్త్రాలను దూషించేవారు, ఇతరులు సంతోషంగా ఉంటే దుఃఖించేవారు, ఎదుటివారు దుఃఖిస్తుంటే ఆనందించేవారు, చెడుమాటలు పలికేవారు కూడా దుర్గతుల పాలు కాక తప్పదు. పెద్దల

## వేంకటేశుని నామస్మరణతో 32 వేల సంకీర్తనల- భక్తి సాగరంలో అమృతధారగా అన్నమయ్య జీవితం

బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే!' అంట ఈ చరాచర సృష్టి మొత్తం వ్యాపించి ఉన్నది శ్రీనివాసుడే అని భావించి తన కీర్తనలతో కొండలలో నెలకొన్న కోనేటిరాయుని స్వరాభిషేకం చేసిన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుని జయంతి సందర్భంగా ఆ మహనీయుని జీవిత విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం. జననంఎందరో మహనీయులు జన్మించిన వైశాఖమాసంలోనే శ్రీ అన్నమాచార్యులు కూడా జన్మించాడు. అన్నమయ్య మే 9, 1408 వ సంవత్సరంలో కడప జిల్లా మండలంలోని తాళ్లపాకలో జన్మించారు.



**అదృశ్య తేజస్సు ప్రసాదించిన దివ్య ఖడ్గం**

శ్రీనివాసుని భక్తులైన నారాయణసూరి, లక్కమాంబ దంపతులకు సంతానం లేకపోవడంతో తీవ్ర వ్యధకు గురయ్యారు. ఈ పుణ్య దంపతులు సంతానం కోసం చేయని వ్రతం లేదు. తమకు సంతానం ప్రసాదించమని ఆ దంపతులు వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమల చేరుకొని స్వామి మందిరంలోకి ప్రవేశించారు. గరుడ స్థంభం వద్ద సాష్టాంగపడి మ్రొక్కారు. ఆ సమయంలో వాళ్లకు ఏదో మైకం కమ్మినట్లైంది. కళ్లు మిరుమిట్లు గొలిపే ఒక తేజస్సు కనిపించి ధగధగ మెరిసే ఖడ్గాన్ని వాళ్ల చేతుల్లో పెట్టి అదృశ్యమైంది. ఆ విధంగా వేంకటేశ్వరస్వామి తన నిజ ఖడ్గమైన నందకాన్ని ఆ పుణ్య దంపతులకు ప్రసాదించాడు. వాళ్లు పరమానందంతో వేంకటపతిని దర్శించి, సంతోషంతో తాళ్లపాకకు తిరిగి వచ్చారు.

**అన్నమయ్య జననం**

కొంతకాలానికి లక్కమాంబ గర్భవతి అయింది. వైశాఖ మాసం పౌర్ణమి రోజు విశాఖ నక్షత్రంలో ఆ పుణ్య దంపతులకు అన్నమయ్య జన్మించాడు. ఆ దంపతుల సంతోషానికి అవధులు లేకుండా పోయింది. బాల్యంలో అన్నమయ్య మాటిమాటికీ వెంకన్న పేరు చెబితేనే ఉగ్గుపాలు త్రాగేవాడు. వేంకటపతికి మొక్కమని చెబితేనే మొక్కేవాడు. వేంకటపతి మీద జోల పాడితే నిద్ర పోయేవాడు.

**తిరుమల పయనం**

ఊరికే పాటలు పాడుతూ ఉంటే జీవనం ఎలా సాగుతుందని పెద్దలు మందలించిన మీదట పశువుల కోసం గడ్డి కోయడానికి అడవికి వెళ్లిన అన్నమయ్య జీవితం ఆ రోజు నుంచి గొప్ప మలుపు తిరిగింది. వేంకటనాథుని దర్శనం కోసం తిరుమల వెళ్తున్న యాత్రికుల గుంపుతో కలిసి తిరుమల చేరుకున్నాడు.

**శ్రీవారి దివ్య దర్శనం**

బంగారు వాకిలి చెంతకు చేరి, దివ్య పాదాలతో, కటివరద హస్తాలతో సకలాభరణ భూషితుడైన దివ్యమంగళ శ్రీమూర్తిని దర్శించుకొన్నాడు. తీర్థ ప్రసాదాలను స్వీకరించి, శఠగోపంతో ఆశీర్వచనం పొంది, ఆ రాత్రి ఒక మండపంలో విశ్రమించాడు. తరువాత అన్నమయ్య కొండపై కుమార ధార, ఆకాశ గంగ, పాప వినాశం వంటి తీర్థాలను దర్శించి, కొండపైనే స్వామిని కీర్తిస్తూ ఉండిపోయాడు. అతని కీర్తనలు విని అర్చకులు అతనిని ఆదరించసాగారు.

**వివాహం**కటివరద హస్తాలతో సకలాభరణ భూషితుడైన దివ్యమంగళ శ్రీమూర్తిని దర్శించుకొన్నాడు. తీర్థ ప్రసాదాలను స్వీకరించి, శఠగోపంతో ఆశీర్వచనం పొంది, ఆ రాత్రి ఒక మండపంలో విశ్రమించాడు. తరువాత అన్నమయ్య కొండపై కుమార ధార, ఆకాశ గంగ, పాప వినాశం వంటి తీర్థాలను దర్శించి, కొండపైనే స్వామిని కీర్తిస్తూ ఉండిపోయాడు. అతని కీర్తనలు విని అర్చకులు అతనిని ఆదరించసాగారు.

అన్నమయ్య తిరుమలలో ఉన్నాడని తెలిసి అతని తల్లిదండ్రులు ఇంటికి రమ్మని బ్రతిమాలి తిరిగి తీసుకు వెళ్లారు. తిమ్మక్క, అక్కమ్మ అనే ఇద్దరు కన్యలను వివాహం చేసుకున్నాడు. తిరిగి తన భార్యలతో కలిసి శ్రీనివాసుని దర్శించినప్పుడు శ్రీవారికి రోజుకొక సంకీర్తన వినిపించాలని నిర్ణయిం చుకుంటాడు. అప్పటి నుంచి అన్నమయ్య శ్రీవారి మీద పుంఖానుపుంఖాలుగా కీర్తనలు రచించగా, అతని శిష్యులు వాటిని గానం చేస్తూ తాళపత్రాలకు ఎక్కించసాగారు.

**రాజాశ్రయం**


కొంతకాలం అన్నమయ్య సాళ్వ నరసింగరాయలు ఆస్థానంలో రాజును ఆశ్రయించి ఉన్నాడు. కానీ రాజాశ్రయం తనకు సరైనది కాదని తలచిన అన్నమయ్య తిరుమల చేరాడు. తన శేషజీవితాన్ని స్వామి సన్నిధిలో నిత్యారాధనలో, సంకీర్తనా దీక్షలో గడిపాడు. ఈ దశలో బహుశా ఆధ్యాత్మిక సంకీర్తనలు అధికంగా రచించాడు.

**వేంకటేశ్వరునితో ఐక్యం**

95 సంవత్సరాలు జీవించి, వేంకటేశుని సేవలో తన జీవితాన్ని చరితార్థం చేసుకున్న అన్నమయ్య ఫాల్గుణ బహుళ ద్వాదశి నాడు 1503 ఫిబ్రవరి 23 రోజున శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో స్వామిలో ఐక్యమయ్యాడు. ఆ కాలంలో రాగిరేకుల మీద రాసిన తిథుల కారణంగా అన్నమయ్య జనన, మరణ విశేషాలు లోకానికి తెలుస్తున్నాయి. నేటికీ ఏడుకొండలవాడు అన్నమయ్య వంశస్థులు పాడే సుప్రభాతంతో మేల్కొంటాడు. లాలిపాట తో నిద్రపోతాడు. భక్తి మార్గంలో పయనిస్తూ దాదాపు 32 వేల సంకీర్తనలతో శ్రీనివాసునికి స్వరాభిషేకం చేసిన అన్నమయ్య జయంతి ఉత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఘనంగా నిర్వహిస్తారు. ఆ మహనీయుని జన్మదినం రోజు అన్నమయ్య చూపిన భక్తి మార్గంలో నడవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. ఓం నమో వేంకటేశాయ!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

## ఎప్పుడూ ఉరుకులు, పరుగులేనా? – తల్లిదండ్రులకూ “వ్యక్తిగత సమయం” ముఖ్యమే!



ఇంట్లో అవసరాల కోసం పరుగులు, ఉద్యోగం కోసం ఉరుకులు, పిల్లల భవిష్యత్తు కోసం వ్యూహాలు.. తల్లిదండ్రులైన వారంతా రోజంతా ఇలాగే గడుపుతున్నారు. మరి, మీ ఆరోగ్యం, ఆనందం గురించి కాసేపైనా ఆలోచిస్తున్నారా? ఈ క్రమంలో రోజులో మీ కోసం అంటూ కొంత సమయం కేటాయించుకోవాలంటున్నారు నిపుణులు. ఇలా వ్యక్తిగత సమయం ఎందుకు అవసరమో ఇప్పుడు తెలుసుకుందాం!

కుటుంబ అవసరాలతో రోజంతా సతమతమయ్యే తల్లిదండ్రులు తమకంటూ కాస్త వ్యక్తిగత సమయాన్ని కేటాయించుకోవడమే మర్చిపోతున్నారు. అయితే, వారి వ్యక్తిగత సమయం తల్లిదండ్రులకు ఒత్తిడి నుంచి కోలుకోవడానికి సహాయపడుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. తమ కోసం కొంత సమయాన్ని కేటాయించుకునే తల్లిదండ్రులు అదే రోజున మంచి అనుభూతిని పొందుతారని, ఒత్తిడికి దూరంగా, ఆరోగ్యంగా కనిపిస్తారని నాఐఎశీఅ ఖీతీఖుంవతీ ఖఅఅజవతీంట్‌ఎలో సామాజిక సంబంధాల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ థెరస్సా పౌలీ చెబుతున్నారు.వ్యక్తిగత సమయం ఎందుకు ముఖ్యం : పిల్లల పెంపకం తరచూ తల్లిదండ్రుల వ్యక్తిగత అవసరాల్ని చివరి స్థానంలో ఉంచుతుందని అమెరికాలో జరిపిన ఓ అధ్యయనంలో తేలింది. ఇందులో 40 ఏళ్ల వయసున్న దాదాపు 318 మంది పాల్గొన్నారు. తమ కోసం తాము సమయాన్ని కేటాయించుకున్నారా? లేదా? అనే దానితో పాటు, తమ భావోద్వేగాలను ప్రతిరోజూ సాయంత్రం తెలియజేసేవారు. వాటిలో సంతోషం, ప్రశాంతత, సంతృప్తి వంటి సానుకూల భావాలతో పాటు కోపం, నిరాశ, విచారం, ఆందోళన వంటి ప్రతికూల భావాలూ ఉన్నాయట. ఈ అధ్యయనం ఒత్తిడికి సంబంధించిన జీవ సంబంధ సూచికను కూడా కొలిచింది. శరీర ఒత్తిడి ప్రతిస్పందనలో పాలుపంచుకునే కార్టిసాల్ హార్మోన్?ను పరిశోధకులు గమనించారు. మాములుగా కార్టిసాల్ స్థాయిలు ఉదయంపూట ఎక్కువగా ఉండి, రోజంతా క్రమంగా తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ తగ్గుదల వేగంగా ఉంటే ఒత్తిడి నుంచి ఆరోగ్యంగా కోలుకోవచ్చని అంటున్నారు. తగ్గుదల నెమ్మదిగా ఉంటే.. అది దీర్ఘకాలిక ఒత్తిడి, అనేక రకాల ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉంటుందని పేర్కొంటున్నారు. పేరెంట్స్ తమ కోసం సమయాన్ని కేటాయించుకున్నామని చెప్పినప్పుడు ఎక్కువ సానుకూల భావోద్వేగాలను, ఆరోగ్యకరమైన కార్టిసాల్ నమూనాల్నీ కలిగి

## చదువుల్లో అద్భుతంగా రాణించాలా? పరిహారాలు చేసుకోండిలా!



నవగ్రహాలలో గురు గ్రహానికి మంచి స్థానముంది. విద్యార్థులు చదువులో చురుగ్గా ఉండాలన్నా, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నా గురువు అనుగ్రహం ఎంతో ముఖ్యం. గురువు అనుగ్రహం లేకుంటే మందబుద్ధిగా ఉండడం, పరీక్షల్లో తరచుగా వైఫల్యం చెందడం వంటివి జరుగుతుంటాయి. విద్యార్థులు చదువులో ఉన్నత స్థితికి చేరుకోవడానికి గురువు బోధనలు పాటించడం ఎంత ముఖ్యమో నవగ్రహాలలో గురువు అనుగ్రహం కూడా అంతే అవసరం. ఈ కథనంలో విద్యార్థులు గురువు అనుగ్రహం కోసం పాటించాల్సిన పరిహారాలు గురించి తెలుసుకుందాం.

**గురువారం పరిహారం!**

పిల్లల బంగారు భవిష్యత్తు, విద్యాభివృద్ధి కోసం పిల్లలతో తరచుగా గణపతి, సరస్వతి పూజ సూర్యనమస్కారం, హయగ్రీవ స్తోత్రాలు చేయిస్తుండాలి. విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తు, వారు క్రమశిక్షణతో మంచి అలవాట్లు, ఆలోచనలతో కూడిన విద్యార్జన సాధన కోసం శివ స్వరూపమైన దక్షిణామూర్తిని ఆరాధించాలి. ఇది మాత్రమే కాకుండా గురు గ్రహ అనుకూలత కోసం శాస్త్రంలో సూచించిన మరికొన్ని పరిహారాలు కూడా తెలుసుకుందాం.

**దక్షిణామూర్తి ఆరాధన**

గురు గ్రహ అనుకూలత కోసం గురువారం రోజు శివాలయంలో ప్రతిష్ఠించి ఉన్న దక్షిణామూర్తి ఎదురుగా పసుపు రంగు వస్త్రం పైన బియ్యం పిండితో తయారు చేసిన రెండు చిన్న ప్రమిదలు పెట్టి, ఒక్కో ప్రమిదలో రెండేసి వత్తులు వేసి, నేతి దీపాలు పెట్టాలి. దీపాలను కుంకుమతో అలంకరించాలి. పిదప భక్తి శ్రద్ధలతో దక్షిణామూర్తి స్తోత్రం పారాయణ చేయాలి. నానబెట్టిన పచ్చి శనగలు దండగా కూర్చి, ఆ మాలను దక్షిణామూర్తికి వేయాలి. ఇలా 9 గురువారాలు చేస్తే కోరుకున్న చోట చదువుకునే అవకాశాలతో పాటు విదేశాలలో విద్యార్జనకు ఉన్న ఆటంకాలు కూడా తొలగుతాయి.

**కొబ్బరి చిప్పలో దీపారాధన**

దత్తాత్రేయ స్వామి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి రెండు చిప్పల్లో కొబ్బరి నూనె పోసి వత్తులు వేసి దీపారాధన చేయాలి. ఈ పరిహారం కూడా 9 గురువారాలు పాటించాలి. ఇలా చేయడం వల్ల విద్యార్థుల్లో తెలివితేటలు పెరిగి చదువులో చురుగ్గా ఉంటారు.

**గోపూజ**

గురువారానికి లక్ష్మీవారమని కూడా పేరుంది. గురువారం శ్రీ మహాలక్ష్మి స్వరూపమైన గోవును పసుపు కుంకుమలతో పూజించి, నానబెట్టిన శనగలు తినిపించడం వల్ల ఉన్నత విద్యావకాశాలు మెరుగు పడతాయి. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నవారికి మంచి ఉద్యోగం లభిస్తుంది. అలాగే గోమాతకు గురువారం రోజు చపాతీలు తినిపించడం వలన ఆకస్మిక గండాలు తొలగుతాయి. గురువారం గోమాతకు గ్రాసం తినిపిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.

బలహీనంగా ఉన్నప్పుడు ప్రసిద్ధ గురు క్షేత్రాలను సందర్శించడం ఉత్తమ ఫలితాలనిస్తుంది. మన దేశంలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపుర్‌లోని బృహస్పతి ధామ్ ప్రసిద్ధ గురు క్షేత్రం. అలాగే కుంవారం శ్రీ మహాలక్ష్మి స్వరూపమైన గోవును పసుపు కుంకుమలతో పూజించి, నానబెట్టిన శనగలు తినిపించడం వల్ల ఉన్నత విద్యావకాశాలు మెరుగు పడతాయి. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నవారికి మంచి ఉద్యోగం లభిస్తుంది. అలాగే గోమాతకు గురువారం రోజు చపాతీలు తినిపించడం వలన ఆకస్మిక గండాలు తొలగుతాయి. గురువారం గోమాతకు గ్రాసం తినిపిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.

బలహీనంగా భకోణంలో గురుస్థానం ప్రత్యేకమైన గురు క్షేత్రం. అలాగే వారణాసిలోని ద

**దత్త పారాయణ**

దత్తాత్రేయ స్వామి జీవిత చరిత్ర అయిన గురు చరిత్ర ప్రతి గురువారం పారాయణ చేయడం వల్ల గురుగ్రహ అనుగ్రహం పరిపూర్ణంగా లభిస్తుంది. కుటుంబంలో ఆర్థిక సమస్యలు తొలగి పోతాయి.

**గురు క్షేత్రాల దర్శనం**

జాతకంలో గురు గ్రహం బలహీనంగా ఉన్నప్పుడు ప్రసిద్ధ గురు క్షేత్రాలను సందర్శించడం ఉత్తమ ఫలితాలనిస్తుంది. మన దేశంలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపుర్‌లోని బృహస్పతి ధామ్ ప్రసిద్ధ గురు క్షేత్రం. అలాగే కుంభకోణంలో గురుస్థానం ప్రత్యేకమైన గురు క్షేత్రం. అలాగే వారణాసిలోని దశాశ్వమేధ ఘాట్ వెళ్లే మార్గంలో ఉన్న శ్రీ బృహస్పతి మహాదేవ్ మందిర్ కూడా ప్రసిద్ధ గురు క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఉత్తరాఖండ్ రాష్ట్రం నైనిటాల్ జిల్లా సమీపంలో సముద్ర మట్టానికి సుమారు 8000 అడుగుల ఎత్తులో ఉన్న దేవ గురు పర్వతంపై వెలసిన బృహస్పతి ఆలయం కూడా ప్రసిద్ధ గురు క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇవి కాకుండా ప్రముఖ దత్త క్షేత్రమైన గాణగాపూర్, కురుపురం, శిర్డీ సాయినాథుని ఆలయం కూడా ప్రసిద్ధి చెందిన గురు క్షేత్రాలు. ఈ ఆలయాలను దర్శించడం వల్ల గురు గ్రహ దోషాలు తొలగి సకల శుభాలు చేకూరుతాయి.

**పిల్లలు మాట వినడం లేదా!**

ఒకవేళ పిల్లలు ఇలాంటి పూజలు చేయడానికి ఇష్టపడని సందర్భాలలో పిల్లల తరఫున వారి తల్లిదండ్రులు ఈ పూజలు చేయడానికి శాస్త్రం అనుమతిస్తుంది. కాబట్టి పిల్లలే పూజలు చేయాలని అనుకోకుండా వారి తరఫున పెద్దలు కూడా ఈ పూజలు చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు పొందవచ్చు.

విద్యార్థులకు చదువులో ఆటంకాలు తొలగించి వృత్తి పరమైన పురోగతి అందించే ఈ గురువారం పరిహారాలు పాటించడం వల్ల విద్యాపరమైన అభివృద్ధితో పాటు సకల శుభాలు పొందవచ్చు.

**ఓం శ్రీ గురుభ్యోనమః!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలి

- సింగరేణిలో మెడికల్ బోర్డును నిర్వహించాలి
- కంపెనీ పరిరక్షణ కోసం ఉద్యమిస్తాం
- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**భద్రాద్రి కొత్తగూడెం :** బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను పార్టీ పెట్టిన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వణుకు పుడుతుందన్నారు. తమ పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా కంప్లైంట్స్ ఇవ్వడం జరిగిందన్నారు.

టీఆర్ఎస్ అనే పేరు తనకు రాకుండా ఉండాలని కుట్రలు చేస్తున్నారని తెలిపారు. నా ప్రజా పోరాటాలను ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, బీజేపీలతో చేతులు కలుపుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి ఒక నీతి, నియమం అంటూ ఏమీ లేవా అంటూ ప్రశ్నించారు.

తల్లి చెల్లె అనే సభ్యత మరిచి బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఇష్టానుసారం కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. సభ్యత మరిచి తిడితే ఊరుకునేందుకు ఇది ఆంధ్రా కాదని కాళ్లు విరగొట్టి చేతుల్లో పెడతాం అంటూ హెచ్చరించారు. కాళేశ్వరం అవినీతిలో అనకొండ అయిన హరీశ్ రావు నే బీఆర్ఎస్ ఇంకా ముందు పెడుతుందన్నారు. ఇక ఆ పార్టీ జీవితంలో బాగుపడదని స్పష్టమైందన్నారు.

**సింగరేణి రక్షణ కోసం పోరాడుతా...**

సింగరేణి పరిరక్షణ కొరకు తాను శక్తి మేరకు పోరాడుతానని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఇవ్వాళ సింగరేణి ఇబ్బందుల్లో ఉండటానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నారు. సంస్థకు ఇవ్వాల్సిన 54 వేల కోట్లు ఇవ్వకపోవటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులు పనిముట్లు అడిగితే పైసలు లేవంటున్నారని ఇది మహా దారుణమన్నారు.

**కార్మికుల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారు.**

సింగరేణి కార్మికుల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. సింగరేణిలో వన్ విజన్, వన్ ఫ్యామిలీ అంటారు కానీ ఆఫీసర్లకు ఒక రూల్, కార్మికులకు ఒక రూల్ నడుస్తుందన్నారు. కిషన్ రెడ్డి తెలంగాణ బిడ్డనే అయితే సిం గరేణికి టెండర్లు లేకుండా గనులు ఇవ్వాలని తాను నిర్వహించిన మొదటి దఫా బాయి బాటలో డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఒక మైనింగ్ ఇచ్చి ఏదో గొప్పగా చెప్పు కుంటున్నారు కానీ మిగతా 16 గనులను కూడా సింగరేణికి ఇవ్వాలని కోరారు. బీజేపీ నిర్లక్ష్యం కారణంగా సింగరేణి కార్మికులకు చాలా అన్యాయం జరుగుతోందన్నారు. సింగరేణికి ఇచ్చిన తాడిచర్ల-2 సింగరేణియే ఆపరేట్ చేసేలా ఇవ్వాలని అప్పుడు మాత్రమే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తాడిచర్ల-1 మైనింగ్ ను దొడ్డిదారిన ప్రైవేట్ వాళ్లకు ఇవ్వటంతో కార్మికులకు చాలా అన్యాయం జరిగిందన్నారు. సింగరేణిలో 62 వేల మంది కార్మికులు, ఆఫీసర్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు వచ్చేలా బీఆర్ఎస్ గవర్నమెంట్ లో నేను ఎంతో కృషి కృషి చేశానని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు దాన్ని నాశనం చేశారని డబ్బు ఇచ్చిన వాళ్లకే అన్ ఫిట్ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు కచ్చితంగా నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టి పెండింగ్ లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత నెలకు ఒకసారి మెడికల్ బోర్డు పెట్టాలని కోరారు. మెడికల్ బోర్డు పెట్టకపోతే నిరాహార దీక్ష చేస్తా అని హెచ్చరించటంతో మెడికల్ బోర్డు పెడతామంటూ ప్రకటనలు ఇస్తున్నారని కానీ ప్రభుత్వం తరపున స్పష్టమైన ప్రకటన చేయాలని లేదంటే ప్రజా స్వామ్యయుతంగా నిరాహార దీక్ష చేస్తానని స్పష్టం చేశారు.

సింగరేణి కార్మికుల కోసం ప్రాణాలకు తెగించి మేము పోరాటం చేసి చూపిస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే



- వన మహోత్సవ కార్యక్రమం ఏర్పాటుకు లయన్స్ క్లబ్ సభ్యులకు అభినందన

**తొర్రూరు, :** తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కంటయపాలెం రోడ్డులో బృందావన్ ఎస్టేట్ లో తొర్రూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నా రు. గ్లోబల్ వార్మింగ్ దుష్ప్రభావాల నుండి కాపాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దినప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. హరిత తెలంగాణ సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ , వైస్ చైర్మన్ సోమ రజిని, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నాళ్ల శ్రీనివాస్, లయన్స్ ప్రతినిధులు తమ్మెర విశ్వేశ్వరరావు కుందూరు రాజేందర్ రెడ్డి, లక్ష్మీనరసింహారావు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన గైని శ్రీకాంత్



**కామారెడ్డి జిల్లా, :** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై టీ మురళిని మర్యాదపూర్వకంగా జర్నలిస్ట్ గైని శ్రీకాంత్ కలిశారు. . తాడ్వాయి దోమకొండ కామారెడ్డి పోలీస్ స్టేషన్ లో ఉత్తమ సేవలందించి ప్రజల మన్ననలు పొంది బదిలీపై రామారెడ్డి పోలీస్ స్టేషన్ కు వచ్చిన టి మురళిని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఎస్సై టి మురళి మాట్లాడుతూ రామారెడ్డి మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని రాజీ మార్గం రాజా మార్గమని ఆయన మండల ప్రజలకు సూచించారు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు.

# విద్యారంగ సమస్యలపై నేటి బంద్ ను విజయాత చేయాలి

- ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్



**హనుమకొండ, :** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ నేడు రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను పిలుపునిచ్చాయి ఈ సందర్భంగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో వైఫల్యం చెందిందని విద్యా సంవత్సరం ప్రారంభమైన ఇప్పటివరకు విద్యాసంస్థలలో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డ్రెస్సులు సకాలంలో అందక ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు కావున రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత విధానాలకు వ్యతిరేకంగా విద్యారంగంలో రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే కుదించాలనే ఆలోచనను మానుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించాలి. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి, లక్కీ పాత్ర, ఇన్‌చార్జ్, మెను సమస్యలకు కాకుండా భోజన సమస్యలను అరికట్టించాలి. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డిఈవో మరియు లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యావ్యాపారాన్ని అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం చేయాలి. విద్యాసంస్థల చట్టం అమలు చేసి, పేద విద్యార్థులకు 25% ఉచిత ప్రవేశాలు కల్పించాలి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా పెంచిన పుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్ విక్రయ కుంభకోణాలను మూసివేయాలి. పెండింగ్ స్కాలర్‌షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి జి.ఓ. నెం: 7, 8, 9లను రద్దు చేయాలి. ఇంటర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించి నిధులు కేటాయించాలి. అద్దె భవనాలలో నడుస్తున్న పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి. ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేసి ఆధునాతన భవనాలను నిర్మించాలి. విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి బస్ పాసులు ఇవ్వాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచి, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. ప్రతి పాఠశాలకు కరెంట్, ఇంటర్నెట్, తాగునీరు, పంపుదొడ్డి, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలి. ఎన్ ఈ పి 2020 తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి. బెస్ట్ అలవెన్స్ స్కీమ్ బకాయిలు 250 కోట్లు రూపాయలు విడుదల చేయాలని , విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలు డిమాండ్ల పరిష్కారం కోసం నేడు జూలై 10 తేదీన వామపక్ష విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌లో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ పాఠశాల కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొంచుకొని విజయవంతం చేయాల్సిందిగా హకీమ్ నవీద్ విజ్ఞప్తి చేశారు.

# ఉపరితల బొగ్గు గనిని సందర్శించిన ఎంపీ ఎమ్మెల్యే




**కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా :** బెల్లంపల్లి ఏరియాలో ని ఖైరిగుర ఉపరితల బొగ్గు గనిని ఆదిలాబాద్ నియోజకవర్గ లోక్ సభ ఎంపి గోడం నగేష్, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గ శాసన సభ్యుడు పాల్వాయి హారీష్ బాబులు గురువారం సందర్శించారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీరమేష్ వారికి స్వాగతం పలికారు. వ్యూ పాయింట్ నుండి ఉపరితల గనిని పరిశీలించారు. ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను, పని ప్రదేశాలను జిఎం వారికి వివరించారు. సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపి కొనియాడారు. తాడిచర్ల2 బ్లాక్కేటాయింపుకేంద్రంలోని భాజపా ఘనత అని పేర్కొన్నారు. గోలేటి ఉపరితల గని త్వరగా ప్రారంభించాలని సింగరేణి అధికారులకు సూచించారు. ఈకార్యక్రమం లో ఖైరిగుర ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న,ఇంచార్జి మేనేజర్ గౌతమ్ రాజేష్ రెడ్డి, సినియర్ పర్సనల్ అధికారి రజినికుమార్, జి ఆర్ ఎన్ కంపనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



- టి ఆర్ వి ఎస్ మానుకోట జిల్లా అధ్యక్షులు గంగాధర్ సిద్ధూ.

**తొర్రూరు, :** పెండింగ్ లో ఉన్నా 11 వేల కోట్ల స్కాలర్షిప్ మరియు రియంబర్స్మెంట్లను తక్షణమే విడుదల చేయాలని తొర్రూరు పట్టణ కేంద్రంలో టి ఆర్ వి ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ సంఖ్యలో రోడ్డెక్కి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా టి ఆర్ వి ఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధరీ సిద్దు టి ఆర్ వి ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో మహా ధర్నా మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండల కేంద్రం లోని అన్ని కళాశాల విద్యార్థులతో కలిసి పెండింగ్ లో ఉన్న 11000కోట్ల స్కాలర్షిప్ మరియ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని (టి ఆర్ వి ఎస్ ) తెలంగాణ రాజ్యాధికార విద్యార్థి సేన ఆధ్వర్యంలో ఈరోజు ధర్నా నిర్వహించడం జరిగింది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని వారు ఆరోపించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 వేల కోట్ల స్కాలర్షిప్ మరియూ ఫీజు రీయింబర్స్మెంట్ నీ తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా విద్యాశాఖ మంత్రిని కూడా నియమించాలని కోరారు. రేవంత్ సర్కార్ ఏనాడు కూడా విద్యా ర్థుల భవిషత్తుపై శ్రద్ధ చూపిన దాఖలాలు లేవని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టి.ఆర్.వి.ఎస్ నాయకులు,విద్యార్థులు పాల్గొ న్నారు

# బీజేపీ ఎండోమెంట్ సెల్ జిల్లా కన్వీనర్‌గా కస్తూరి సుధాకర్ నియామకం



- నూతన బాధ్యులకు నియామక పత్రాల అందజేత

**భద్రాద్రి కొత్తగూడెం :** భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్(ధార్మిక) సెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్‌గా కస్తూరి సుధాకర్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్ర రావు సూచన మేరకు, రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్న వజ్జుల సూర్యప్రకాష్, రాష్ట్ర కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్ సమక్షంలో ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కో కన్వీనర్లుగా పంజాల రమేష్, దండా రామచంద్రరావు, జాయింట్ కన్వీనర్‌గా చింతల శాంతకుమారిని నియామక పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కస్తూరి సుధాకర్ మాట్లాడుతూ తమకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, రాష్ట్ర కన్వీనర్ అన్న వజ్జుల సూర్యప్రకాష్, కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్, జాయింట్ కన్వీనర్ ఈశ్వర్ ప్రగడ రామారావు, జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఎండోమెంట్ సెల్ నిబంధనలకు లోబడి నీతి నిజాయితీ నిబద్ధత క్రమశిక్షణతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.

# నేడు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్




**(దంతాలపల్లి)** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 10న చేపట్టిన రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ్రాణూఖ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రిజిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ వర్మ్రాణూఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ కోరారు.ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపాలని కోరారు ఖాళీ పోస్టుల భర్తీ చేయాలన్నారు. ప్రవేట్ పాఠశాలలకు ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని పటిష్టం చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పరిశీలించిన తహశీల్దార్ ఇక్బాల్



**వరంగల్, :** వరంగల్ జిల్లా, ఖిలా వరంగల్ మండలం, రంగశాయి పేట గ్రామం, 42 వ డివిజన్ కాపు వాడ లో బూత్ లెవెల్ ఆఫీసర్ నీలం కావ్య గారు చేస్తూ ఉన్న సర్ ఓటరు ప్రక్రియను పరిశీలిస్తూ ఫోన్ అప్ లో ఆన్ లైన్ ఎన్యూమరేషన్ చేస్తూ ఉన్న ఖిలా వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ గారు. ఈ సందర్భంగా ఎం ఆర్ వో ఇక్బాల్ గారూ మాట్లాడుతూ బూత్ లెవెల్ ఆఫీసర్లు అయోమయానికి గురి కాకుండా ఎన్యూమరేషన్ ఫారాలను నింపాలని, ఒక వేళ అర్థం కాక పోతే సంబంధిత అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలని, ప్రజల ను కూడా అయోమయానికి గురి చేయ వద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్, నీలం వేణు, నీలం శ్రీధర్, నీలంకల్యాణ్ చందు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**-సుందరయ్య భవన్ కమిటీ అధ్యక్షులు మల్లయ్య చారి**
**ఉచిత ట్యూషన్ ని సద్వినియోగం చేసుకోవాలి..**



**కుత్బుల్లాపూర్ :జూలై 9 (పీపుల్స్ న్యూస్)** విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సుందరయ్య భవన్ కమిటీ అధ్యక్షులు మల్లయ్య చారి అన్నారు. గురువారం, కళ్యాణ్ ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, జన విజ్ఞాన వేదిక మరియు సుందరయ్య భవన్ కమిటీ సంయుక్త నిర్వహణలో ప్రభుత్వ పాఠశాల బాలికల కోసం ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాం (ఉచిత ట్యూషన్స్) ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం ఎంతో విజయవంతంగా కొనసాగుతోందని, ఈ ఏడాది కూడా అదే ఉత్సాహంతో ప్రారంభించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో మరింత రాణించాలని కోరారు. సుందరయ్య భవన్ కమిటీ అధ్యక్షులు మల్లయ్య చారి మాట్లాడుతూ, ఈకారక్రమం ద్వారా విద్యార్థినులు తమ విద్యా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామనితెలిపారు. విద్యతో పాటు విద్యార్థినుల వ్యక్తిత్వ వికాసానికి కూడా ప్రాధాన్యం ఇస్తూ, వివిధ రంగాలకు చెందిన మేధావులను ఆహ్వానించి వారికి ప్రేరణాత్మక ప్రసంగాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కళ్యాణ్ ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థినుల విద్యా పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయడంతో పాటు అవసరమైన స్టేషనరీ సామగ్రిని కూడా ఉచితంగా అందిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, తల్లిదండ్రులు, రాజేశ్వరరావు, కృష్ణ సాధనాల వెంకటస్వామి నాయుడు, నవీన్, ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాం ఉపాధ్యాయులు ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమం.. చక్కదిద్దినట్లేనా..?

- సాకులు మాటున ఆర్ఐ..?
- నేలమట్టం.. నేడు సెటిల్మెంట్..!
- ఎమ్మార్వో రంగంలోకి డిగాల్సిందేనా..?




**కూకట్ పల్లి : జూలై 9 (పీపుల్స్ న్యూస్)**
ప్రభుత్వ భూమిపై గద్దల్లా వాలిపోతున్న అక్రమార్కులకు, అమ్యామ్యాలకు అలవాటు పడిన స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ సపోర్ట్ గా నిలుస్తున్నారు. స్థానికకూకట్ పల్లి మండల పరిధిలోని, సర్వే నంబరు 336లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్న విషయాన్ని అధికారులకు "పీపుల్స్ న్యూస్" దినపత్రిక ద్వారా పలుమార్లు తెలియచేసినప్పటికి స్థానిక ఆర్ఐ తూతూమంత్రంగా నామమాత్రపు చర్యలు తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పలు దినపత్రికలో కథనాలు వచ్చినప్పటికీ, స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈపై వార్త కథనంపై వివరణ కోరగా, స్థానిక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు కూల్చడానికి జేసీబీ దొరకడం లేదు అని స్థానిక రెవిన్యూ అధికారి ఓ సాకు చెప్పడం అస్యదాస్పదం. అక్రమ నిర్మాణం నిర్మించి, వారం గడుస్తున్నా, జేసీబీ దొరకకపోవడం ఆర్ ఐ నిర్లక్ష్య వైఖరి అద్దం పడుతోంది. గతంలో భూమి ఆక్రమణ జరిగిందని ఫిర్యాదుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మార్వో తానే స్వయంగా చర్యలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేసి, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ సదరు కబ్జాదారులు, అదే స్థలంలో తిరిగి మళ్ళీ నిర్మాణాలు చేపట్టి పది రోజులు గడుస్తున్నా, స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టించుకోక, పైగా స్థానిక రెవిన్యూ అధికారి, అన్నీ తానే వుండి అక్రమార్కులకు సహకరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంధునిమిత్తమే ఈ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోలేక పోతున్నారని, త్వరగా న్యాయస్థానం నుండి స్టే తీసుకోండి అని ఉచిత సలహాలు సూచనలు చేస్తున్నారనే గుసగుసలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి, గతంలో కూల్చివేసిన స్థలంలోనే తిరిగి అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్న స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ మరియు కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కబ్జాదారుల నుండీ ప్రభుత్వ భూమిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# రోజంతా నిలకడగా రాణించి, చివరికి లాభాల్లోనే ముగిసిన సూచీలు



భారత స్టాక్ మార్కెట్లు గురువారం నాటి ట్రేడింగ్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతుతో కీలక సూచీలు లాభాల్లో ముగిశాయి.
ప్రధాన సూచీ అయిన నిఫ్టీ 50 ఇవాళ 80.75 పాయింట్లు (0.34%) లాభపడి 23,962.80 వద్ద ముగియగా, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 238.22 పాయింట్లు (0.31%) పెరిగి 76,741.82 వద్ద స్థిరపడింది.రోజంతా ఒడుదొడుకులు.. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణఉదయం మార్కెట్లు సానుకూల పంథాలో ప్రారంభమయ్యాయి. నిఫ్టీ క్రితం ముగింపు (23,882.05) కంటే మెరుగ్గా 23,928.95 వద్ద ప్రారంభం కాగా, సెన్సెక్స్ క్రితం ముగింపు (76,503.60) కంటే ఎక్కువగా 76,576.14 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించింది.ట్రేడింగ్ మధ్యలో నిఫ్టీ బుల్ రన్‌తో దూసుకుపోతూ 24,134.70 దగ్గర గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే మార్కెట్ ముగిసే చివరి గంటలో (మధ్యాహ్నం 3 గంటల తర్వాత) కొంత లాభాల స్వీకరణ జరగడంతో స్వల్పంగా తగ్గి 23,962.80 వద్ద క్లోజ్ అయింది. సెన్సెక్స్ కూడా ట్రేడింగ్ సమయంలో 77,326.65 పాయింట్ల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరికి ఇది కూడా గరిష్ఠాల నుంచి కొంత వెనక్కి తగ్గి 76,741.82 వద్ద ముగిసింది.

# నష్టాల నుంచి కోలుకున్న సూచీలు.. 500 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్..




బుధవారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కోలుకున్నాయి. లాభాలతో ప్రారంభమయ్యాయి. కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లు మొగ్గుచూపడంతో సూచీలు లాభాల బాట పట్టాయి. వరుసగా ఆరో రోజైన బుధవారం కూడా విదేశీ మదుపర్లు రూ.1963 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయడం సానుకూలంగా మారింది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాల్లో కదలాడుతున్నాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 95.55గా ఉంది
గత సెషన్ ముగింపు (76,503)తో పోల్చుకుంటే గురువారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత భారీగా పుంజుకుంది. ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 548 పాయింట్ల లాభంతో 77,052 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 172 పాయింట్ల లాభంతో 24,054 వద్ద కదలాడుతోంది సెన్సెక్స్, నిఫ్టీలో కల్యాణ్ జువెల్లర్స్, స్విగ్గీ, డిక్సన్ టెక్నాలజీస్, ఎటర్నల్, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి ఇన్ఫోసిస్, నాల్కో, పాలీక్యాబ్, సోలార్ ఇండస్ట్రీస్, కేఈఐ ఇండస్ట్రీస్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 540 పాయింట్ల లాభంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 719 పాయింట్ల లాభంతో ఉంది.

# తుడుం దెబ్బ సీనియర్ నాయకులు పూనెం రామనాథం దశదిన కార్యక్రమాలకు హాజరైన ఆదివాసి ఉద్యమ నాయకులు



**ఇల్లందు న్యూస్ :-**ఇల్లందు మండలం మామిడిగూడెం గ్రామంలో తుడుం దెబ్బ సీనియర్ నాయకులు ఆదివాసి ఉద్యమాల్లో కీలకంగా పనిచేసిన నాయకులు పూనం రామనాథం దశ దిన కార్యక్రమానికి ఆదివాసి ఉద్యమ నాయకులు గురువారం పాల్గొని ఆదివాసి ఉద్యమ జోహార్లు ఉద్యమాభి వందనాలు తెలియజేసారు. రామనాదం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసం నరసింహారావు తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గొగ్గల కోటయ్య, మహ బూబా బాద్ జిల్లా నాయకులు తాటి వెంకన్న,ఇల్లందు మండల నాయకులు సువర్ణపాక రాంబాబు, ఈ సం ముత్యాలు, స్వర్ణబాక నాగేష్, ఎల్లబోయిన కృష్ణ,వజ్జ సురేష్, తాటి రమేష్,వాసం శీను, పూ సం శివ పాల్గొని వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# జిమ్‌కు వెళ్లలేకపోతున్నారా? కేవలం మెట్లు ఎక్కినా చాలు!



నేటి బిజీ జీవనశైలిలో ప్రతిరోజూ జిమ్‌కు వెళ్లడం లేదా ప్రత్యేకంగా వ్యాయామం చేయడం అందరికీ సాధ్యం కాదు. అయితే రోజువారీ జీవితంలోనే సులభంగా చేయగలిగే వ్యాయామాల్లో మెట్లు ఎక్కడం ఒకటి.
ఎలాంటి పరికరాలు అవసరం లేకుండా ఎక్కడైనా చేయగలిగే ఈ అలవాటు శరీరాన్ని చురుకుగా ఉంచడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా మెట్లు ఎక్కడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఎవరెవరు జాగ్రత్తగా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం..గుండె ఆరోగ్యం మెట్లు ఎక్కడం మంచి కార్డియో వ్యాయామం. ఇది గుండె పనితీరును మెరుగుపరచడంతో పాటు రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది.కాళ్ల కండరాలు బలపడతాయిమెట్లు ఎక్కేటప్పుడు తొడలు, కాళ్లు, తుంటి భాగంలోని కండరాలు ఎక్కువగా పనిచేస్తాయి. దీంతో కండరాలు దృఢంగా మారుతాయి.కేలరీలు వేగంగా ఖర్చవుతాయిసాధారణంగా నడకతో పోలిస్తే మెట్లు ఎక్కేటప్పుడు ఎక్కువ శక్తి ఖర్చవుతుంది. దీంతో కేలరీలు ఎక్కువగా కరిగి, బరువు నియంత్రణలో ఉండేందుకు సహాయపడుతుంది.శారీరక దృఢత్వం పెరుగుతుందిక్రమం తప్పకుండా మెట్లు ఎక్కడం వల్ల గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగై శరీర ఫిట్‌నెస్ పెరుగుతుంది. రోజువారీ పనులు కూడా అలసట లేకుండా చేయగలుగుతారు.ఎముకలు దృఢంగా మారతాయిమెట్లు ఎక్కడం బరువు మోసే వ్యాయామం కాబట్టి ఎముకల సాంద్రతను కాపాడటానికి, వాటిని బలంగా ఉంచడానికి ఉపయోగపడుతుంది.ఎవరెవరు జాగ్రత్తగా ఉండాలి?మోకాళ్ల నొప్పి, కీళ్లవాతం, గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, తరచూ తల తిరిగే సమస్య ఉన్నవారు లేదా ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నవారు వైద్యుల సలహాతోనే ఈ వ్యాయామాన్ని చేయాలి. వృద్ధులు కూడా జాగ్రత్తగా మెట్లు ఎక్కాలి.
మెట్లు ఎక్కేటప్పుడు పాటించాల్సిన సూచనలుమొదట నెమ్మదిగా ప్రారంభించాలి.మంచి పట్టు ఉన్న షూస్ ధరించాలి.
అవసరమైతే మెట్ల రెయిలింగ్‌ను పట్టుకుని ఎక్కాలి.గమనిక: మెట్లు ఎక్కడం ఆరోగ్యానికి మేలు చేసే సాధారణ వ్యాయామమే అయినప్పటికీ, మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఎంత మేర చేయాలనేది వైద్యుల సలహా మేరకు నిర్ణయించుకోవడం మంచిది.

# ఐటీ రంగంలో సైలెంట్ లేఆఫ్స్!



భారత ఐటీ రంగంలో సైలెంట్ లేఆఫ్స్ చోటుచేసుకుంటున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పనితీరుపై సమీక్షలు, నైపుణ్యాల ముదింపు పేరిట ఉద్యోగుల తొలగింపులు జరుగు తున్నట్టు తెలుస్తోంది. టీమ్ లీజ్ సంస్థ అం చనాల ప్రకారం, ఈ ఏడాదిలో తొల గింపులు 25 వేల నుంచి 35 వేల వరకూ ఉండే అవకాశం ఉంది. మే నెల నాటికే 15 వేల మంది ఉద్వాసనకు గురయ్యారు. ఇక సీఐఈఎల్ హెచ్ఆర్ సర్వీసెస్ అంచనాల ప్రకారం, ఐటీ రంగంలో ఈ ఏడాది ఇప్పటివరకూ 12 వేల మంది ఉద్వాసనకు గురయ్యారు. 2025, 2026 సంవత్సరాల్లో మొత్తం తొలగింపుల సంఖ్య 43 వేలు దాటే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.గతంలో ఐటీ సేవలకు డిమాండ్ తగ్గడంతో తొలగింపులు జరిగాయని టీమ్ లీజ్ సంస్థ పేర్కొంది. అయితే, ప్రస్తుత లేఆఫ్స్ వెనుక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉన్నట్టు చెబుతోంది. ఏఐతో పెరిగిన ఉత్పాదకత, సంస్థల అవసరాలు, ఉద్యోగుల నైపుణ్యాల మధ్య పెరిగిన అంతరం, బహుళ అంచెల మేనేజ్‌మెంట్ వ్యవస్థలను సరళీకరించాలన్న ప్రయత్నాలు లేఆఫ్స్‌కు కారణమని టీమ్ లీజ్ సంస్థ పేర్కొంది. అవసరాలకు అనుగుణంగా మానవవనరుల్లో మార్పులు జరుగుతున్నాయని సంస్థ పేర్కొంది. సులభంగా ఆటోమేట్ చేయగలిగే బాధ్యతలు, జాబ్స్‌కు ముప్పు ఉన్నప్పటికీ భవిష్యత్ అవసరాల కోసం ప్రత్యేక నిపుణుల నియామకాలు కూడా ఐటీ ఇండస్ట్రీలో జరుగుతున్నాయని పరిశీలకులు చెబుతున్నారు.

# సౌరభ్ గంగూలీకి అరుదైన గౌరవం



భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీకి అరుదైన గౌరవం దక్కింది. అతడికి ప్రతిష్ఠాత్మక ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. బుధవారం గంగూలీ తన 54వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన రోజునే ఆయనకు ఈ గౌరవం దక్కడం విశేషం. కాగా, స్కాట్లాండ్ వేదికగా జులై 8 నుంచి 11 దాకా ఐసీసీ బోర్డు మీటింగ్ జరగనుంది. ఈ సమావేశం ముగిసిన తర్వాత గంగూలీ పేరును అధికారికంగా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చనున్నారు. ఈ గౌరవం దక్కడంపై గంగూలీ స్పందించాడు. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు కల్పించడం తనకు దక్కిన గొప్ప గౌరవం అని గంగూలీ అన్నాడు. ఇందుకుగానూ ఐసీసీ బోర్డు, ఐసీసీ ఛైర్మన్ జై షాకు థాంక్స్ చెబుతూ ఎక్స్‌లో ఓ పోస్టు చేశాడు. 'నన్ను హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చినందుకు ఐసీసీ, బోర్డు ఛైర్మన్ జై షాకు ధన్యవాదాలు. ఇది నాకు దక్కిన గొప్ప గౌరవం. ఇప్పటివరకు హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న భారతీయులలో నేనూ ఒకడిని కావడం, అలాగే గొప్ప వ్యక్తుల పేర్లతో పాటు నా పేరు కూడా చేరడం ఆనందంగా ఉంది' అని గంగూలీ ఎక్స్ పోస్టులో రాసుకొచ్చాడు.

కాగా, ఈ ఘనత దక్కించుకున్న 12వ భారత క్రికెటర్ గంగూలీ. భారత క్రికెట్‌కు గంగూలీ 2000 నుంచి 2005 మధ్య కెప్టెన్సీగా సేవలు అందించారు. ముఖ్యంగా మ్యాచ్-ఫిక్సింగ్ సంక్షోభం తర్వాత జట్టును పునర్నిర్మించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. గంగూలీ 113 టెస్టుల్లో 7,212 పరుగులు, అలాగే 311 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో 11,363 పరుగులు సాధించాడు. ఇదిలా ఉండగా, సౌరభ్ గంగూలీ పుట్టినరోజు సందర్భంగా 'దాదా: ది సౌరభ్ గంగూలీ స్టోరీ' బయోపిక్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది ఆ సినీ బృందం. బాలీవుడ్ కథా నాయకుడు రాజ్‌కుమార్ రావ్ ప్రధానపాత్రలో నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం వచ్చే ఏడాది మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విక్రమాదిత్య దర్శకత్వం వహిస్తుండగా, లవ్ రంజన్, అంకుర్ గార్గ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా రిలీజ్ చేసింది. గంగూలీ 'జెర్సీ' మూమెంట్‌ను గుర్తుచేస్తున్నట్లున్న ఈ ఫస్ట్‌లుక్‌కు నెటిజన్లు, గంగూలీ అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. నాట్‌వెస్ట్ ట్రోఫీలో భాగంగా 2002లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ జట్టుపై భారత్ గెలిచినప్పుడు స్టేడియం బాల్కనీలో ఉన్న గంగూలీ తన జెర్సీని విప్పి చేత్తో తిప్పుతూ సంబరాలు చేసుకున్న దృశ్యాన్ని క్రికెట్ అభిమానులు ఇప్పటికీ మరచిపోలేరు. తాజాగా విడుదలైన ఫస్ట్‌లుక్‌లో రాజ్‌కుమార్ రావ్ ఆ ఐకానిక్ మూమెంట్‌ను రీక్రియేట్ చేశారు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన జ్ఞాపకంగా క్రీడాభిమానుల మదిలో నిలిచిపోయిన ఈ దృశ్యాన్ని గంగూలీ ఇన్‌స్టాలో పంచుకున్నారు. 'అత్యుత్తమ బహుమతి! మీరు నా కవర్ డ్రైవ్ ఆడడం చూడడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను రాజ్‌కుమార్' అనే క్యాప్షన్ పెట్టారు. యువ క్రికెటర్ నుంచి ఇండియాలో అత్యంత ప్రభావవంతమైన కెప్టెన్‌లో ఒకరిగా ఎదిగిన గంగూలీ ప్రయాణాన్ని ఈ సినిమాలో చూపిస్తున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి.

# వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు

## నాలుగో టీ20పై టీమిండియా కసరత్తు



భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టీ20 సిరీస్ ప్రస్తుతం అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇప్పటికే టీమిండియా 3 మ్యాచ్‌లలో రెండు ఓడిపోగా, ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. దీనితో సిరీస్‌లో వెనుకబడిన భారత్, తన సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే బ్రిస్టల్‌లో జరగబోయే నాలుగో టీ20 మ్యాచ్‌లో ఖచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ఈ చావో రేవో పోరు జట్టుకే కాకుండా, టీమిండియా యువ ఓపెనర్, యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి కూడా అత్యంత కీలకంగా మారింది. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఆశించిన స్థాయిలో ఆరంభం లభించని వైభవ్, తన మూడో మ్యాచ్‌లోనైనా పాత ఐపీఎల్ హిస్టరీని రిపీట్ చేస్తాడా అనే ఆశతో క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.భారత జట్టు మేనేజ్‌మెంట్ ఈ ఇంగ్లాండ్ టూర్‌లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఐర్లాండ్ సిరీస్‌తో పాటు ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లోనూ వరసగా విఫలమైన సీనియర్ ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు పడింది. యువ హిట్టర్ వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్స్ రావడంతో, రెండో టీ20 మ్యాచ్ ద్వారా అతను అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. అయితే, ఆడిన మొదటి రెండు ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో వైభవ్ వరుసగా 14 పరుగులు, 13 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఈ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతని బ్యాటింగ్‌లో అగ్రెసివ్ షాట్లు, సిక్సర్లు బాదగల విస్ఫోటక శైలి కనిపించినప్పటికీ, ఆ హిట్టింగ్‌ను పెద్ద ఇన్నింగ్స్‌గా మార్చడంలో అతను విఫలమయ్యాడు.వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడిన మొదటి రెండు మ్యాచ్‌లలో ఫెయిల్ అయినప్పటికీ, క్రికెట్ పండితులు అతనిపై గట్టి నమ్మకంతో ఉన్నారు. దీనికి కారణం అతని ఐపీఎల్ కెరీర్ లోని ఒక అద్భుతమైన సెంటిమెంట్. వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2025 సీజన్ ద్వారా లీగ్‌లోకి అరంగేట్రం చేశాడు. తన మొదటి ఐపీఎల్ మ్యాచ్‌లోనే 20 బంతుల్లో 34 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే, రెండో మ్యాచ్‌లో కేవలం 16 పరుగులకే అవుటయ్యాడు. కానీ, తన కెరీర్‌లోని మూడో ఐపీఎల్ మ్యాచ్‌లో వైభవ్ ఏకంగా విశ్వరూపం చూపించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఇంటర్నేషనల్ బౌలర్లను ఉతికేస్తూ, కేవలం 34 బంతుల్లోనే శతకం బాదాడు. మొత్తం 38 బంతుల్లో 11 సిక్సర్ల సాయంతో 101 పరుగులు చేసి ప్రపంచ క్రికెట్‌ను ఒక్కసారిగా తనవైపు తిప్పుకున్నాడు.ఐపీఎల్‌లో జరిగినట్లే ఇప్పుడు ఇంటర్నేషనల్ క్రికెట్‌లో కూడా తన మూడో మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. వైభవ్‌కు ఒక అద్భుతమైన రికార్డ్ ఉంది; తన చిన్న కెరీర్‌లోనే జట్టుకు అత్యంత అవసరమైన, ప్రెజర్ ఎక్కువగా ఉండే డూ ఆర్ డై మ్యాచ్‌ల్లోనే అతను ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ఐపీఎల్ అయినా, అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్ అయినా, లేదా ఇటీవలే జరిగిన ఇండియా-ఎ, శ్రీలంక-ఎ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ అయినా.. వైభవ్ ఎల్లప్పుడూ ఒత్తిడిని జయించి గేమ్ ఛేంజర్ ఇన్నింగ్స్‌లు ఆడాడు.

# టాప్ ఆర్డర్‌లోనే సంజూకు అవకాశాలు ఇవ్వాలి

## మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా టీమ్ సూచన



ఇంగ్లాండ్‌తో బ్రిస్టల్ వేదికగా జరగబోయే నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు భారత జట్టు సెలెక్షన్, బ్యాటింగ్ ఆర్డర్‌పై మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటర్ ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. స్టార్ ప్లేయర్ సంజూ శాంసన్ పట్ల టీమ్ మేనేజ్‌మెంట్ ప్రవర్తిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. జట్టులో మార్పులు చేయాల్సి వస్తే మొదట సంజూ శాంసన్‌నే పక్కన పెట్టడం లేదా బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు నెట్టడం ఒక అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేఎల్ రాహుల్ విషయంలో కూడా ఇలాగే చేశారని, ఇప్పుడు సంజూను కూడా అదే విధంగా ట్రీట్ చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదని గంభీర్, శ్రేయస్ అయ్యర్ లూప్‌కు ఆకాశ్ చోప్రా సూచించారు.మొదటి టీ20 తర్వాత గత రెండు మ్యాచ్‌లుగా సంజూ శాంసన్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కలేదు. ఓపెనర్లుగా వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మలు బరిలోకి దిగుతుండటంతో సంజూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీనిపై ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "ఒకవేళ మీరు నాలుగో మ్యాచ్‌లో సంజూను జట్టులోకి తెచ్చినా, ప్రస్తుత బ్యాటింగ్ ఆర్డర్ ప్రకారం అతనిని ఎక్కడ ఆడిస్తారు వైభవ్, అభిషేక్ ఓపెనింగ్ చేసి, ఈషాన్ కిషన్ నెంబర్ 3లో, శ్రేయస్ అయ్యర్ నెంబర్ 4లో వస్తే.. కేవలం కుడిచేతి వాటం బ్యాటర్ కావాలనే కారణంతో సంజూ శాంసన్‌ను నెంబర్ 5 పొజిషన్‌లో ఆడించడం సరైన నిర్ణయం కాదు. అసలు ఇందులో సంజూ చేసిన తప్పేంటి జట్టులో ఎవరినైనా తీసేయాలంటే మొదట గుర్తొచ్చేది అతనే, అలాగే బ్యాటింగ్ ఆర్డర్ మార్చాలన్నా బలయ్యేది అతనే. నేను ఎప్పుడు సంజూను ఆడించినా మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా ఆడించను, అతని కోసం ఓపెనింగ్ స్థానాన్ని ఖాళీ చేస్తాను. ఎందుకంటే అతను అక్కడే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వగలడు" అని స్పష్టం చేశారు.గణాంకాల పరంగా చూసినా సంజూ శాంసన్‌ను టాప్ ఆర్డర్‌లోనే ఆడించాలని ఆకాశ్ చోప్రా గుర్తు చేశారు. సంజూ శాంసన్ తన కెరీర్‌లో ఆడిన 57 టీ20 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లలో కేవలం 10 సార్లు మాత్రమే నెంబర్ 5 లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆ మ్యాచ్‌లలో అతని యావరేజ్ కేవలం 21.13 గా మాత్రమే ఉంది. మొత్తం మీద ఆ పొజిషన్‌లో అతను చేసిన పరుగులు 169 మాత్రమే. దీనిని బట్టి చూస్తే లోయర్ మిడిల్ ఆర్డర్ అనేది సంజూ శాంసన్ శైలికి సరిపోదని, అతనికి ఓపెనింగ్‌లోనే ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని ఆకాశ్ చోప్రా డిమాండ్ చేశారు.ఇదే సమయంలో జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఫామ్‌పై వస్తున్న విమర్శలను ఆకాశ్ చోప్రా కొట్టిపారేశారు. సంజూ శాంసన్ కోసం తిలక్ వర్మను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. "తిలక్ వర్మ మన జట్టుకు వైస్ కెప్టెన్. ఈ సిరీస్‌లో అతని ప్రదర్శన అంత ఘోరంగా ఏమీ లేదు. గత నాలుగు మ్యాచ్‌లను గమనిస్తే అతనికి వచ్చిన అవకాశాలు చాలా తక్కువ. ప్రస్తుతం అతను బ్యాటింగ్ చేస్తున్న పొజిషన్ చాలా కఠినమైనది. అలాంటి స్థానంలో ప్రతి మ్యాచ్‌లోనూ స్థిరంగా రాణించడం ఎవరికైనా కష్టమే. అతని విషయంలో మేనేజ్‌మెంట్ కాస్త ఓపికగా వ్యవహరించాలి. సంజూ శాంసన్‌కు చోటు కల్పించడం కోసం తిలక్ వర్మ స్థానాన్ని మార్చాల్సిన అవసరం లేదు" అని ఆకాశ్ చోప్రా భారత జట్టుకు సలహా ఇచ్చారు.

# స్టోక్స్ రిటైర్మెంట్ వీడియోపై ఐసీసీ సీరియస్



మ్యాచ్ జరుగుతుండగా, డ్రెస్సింగ్ రూమ్‌లో రికార్డు చేసిన వీడియోను రిలీజ్ చేయడం పట్ల ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని ఇంగ్లాండ్, వెల్స్ క్రికెట్ బోర్డును కోరింది. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు జరుగుతుండగా ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఈసీబీ విడుదల చేయడంపై వివాదం చెలరేగింది. అంతర్జాతీయ క్రికెట్‌కు హఠాత్తుగా వీడ్కోలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశాడు బెన్ స్టోక్స్ . ట్రెంట్ బ్రిడ్జ్‌లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టు 4వ రోజు బెన్ స్టోక్స్ వీడ్కోలు వార్త బయటకొచ్చింది. ఆ రోజు ఆట మొదలవ్వడానికి ముందే డ్రెస్సింగ్ రూమ్‌లో స్టోక్స్ తనకు కెప్టెన్‌గా, ఆటగాడిగా ఇదే చివరి మ్యాచ్ అని సహచరులకు చెప్పాడు. అతడు తన వీడ్కోలు గురించి వెల్లడిస్తుండగా ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు మీడియా బృందం ఆ దృశ్యాలను రికార్డు చేసింది. అదేరోజు టీ బ్రేక్ సమయంలో సోషల్ మీడియాలో, టీవీ ఛానెల్లలో స్టోక్స్ రిటైర్మెంట్ వార్త వెలుగులోకి వచ్చింది. ఇక మ్యాచ్ జరుగుతుండగానే స్టోక్స్ వీడ్కోలు వీడియో బయటకు రావడంపై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆటగాడు, మ్యాచ్ అధికారులకు సంబంధించిన (పీఎంఓఏ) నిబంధలన ప్రకారం బెన్ స్టోక్స్ ఉల్లంఘనకు పాల్పడ్డాడని, ఈసీబీ కూడా ఇందులో హద్దు మీరిందని ఐసీసీ పేర్కొంది. పీఎంఓఏ నిబంధల ప్రకారం, మ్యాచ్ సమయంలో.. డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలాంటివి రికార్డు చేయకూడదు. దీన్ని అతిక్రమణగా తేల్చిన ఐసీసీ.. దీనిపై వివరణ ఇవ్వాలని ఈసీబీకి నోటీసులు పంపింది.మరోవైపు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్.. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు నోటీసులు పంపడంపై బెన్ స్టోక్స్ సెటైర్ వేశాడు. దీనిపై సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. 'అతడిపై వేటు వేయండి' అని ట్వీట్ చేశాడు. ఇక ఈ వివాదంపై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం.

# మేజర్ లీగ్ క్రికెట్ 2026 సీజన్‌లో సరికొత్త రికార్డు



మేజర్ లీగ్ క్రికెట్ 2026 సీజన్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆటగాడైన సౌతాఫ్రికా యువ సెన్సేషన్ లూవాన్-డ్రే ప్రిటోరియస్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ తరఫున బరిలోకి దిగిన ఈ 20 ఏళ్ల బ్యాటర్, ఎంఐ న్యూయార్క్‌పై విశ్వరూపం ప్రదర్శించాడు. కేవలం 52 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి.. మేజర్ లీగ్ క్రికెట్ చరిత్రలోనే శతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. డల్లాస్‌లోని గ్రాండ్ ప్రైరీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ 9 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్ భీకర బౌలింగ్ ధాటికి పరుగుల వరద పారించలేకపోయింది. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 143 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం క్రీజులోకి వచ్చిన ప్రిటోరియస్ తొలి ఓవర్ నుంచే పరుగుల దాడి చేయడంతో మరో 26 బంతులు మిగిలి ఉండగానే శాన్ ఫ్రాన్సిస్కో అలవోకగా విజయం సాధించింది. భారీ హిట్టింగ్‌తో స్టేడియాన్ని హోరెత్తించిన ఈ మెరుపు ఇన్నింగ్స్ వెనుక ఓ ఇంట్రెస్టింగ్ స్టోరీ ఉంది. ప్రిటోరియస్ ఈ రికార్డు ఇన్నింగ్స్ ఆడింది తన సొంత బ్యాట్‌తో కాదు. తన ఓపెనింగ్ భాగస్వామి ఫిన్ అలెన్ బ్యాట్‌ను అడిగి మరి తీసుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న తర్వాత ప్రిటోరియస్ నవ్వుతూ.. "నేను ఫిన్ అలెన్ బ్యాట్‌తో ఆడాను. నా బ్యాట్‌తో ఆడితే బహుశా ఇన్ని భారీ సిక్సర్లు కొట్టలేకపోయేవాడిని. ఇప్పుడు ఎలాగైనా ఈ బ్యాట్‌ను నా బ్యాగ్‌లో శాశ్వతంగా పెట్టేసుకోవాలి" అని పేర్కొన్నాడు. ఈ అద్భుత విజయంతో శాన్ ఫ్రాన్సిస్కో జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను పెంచుకుంది. ప్రస్తుత టోర్నమెంట్‌లో ప్రిటోరియస్ వరుస హాఫ్ సెంచరీలతో భీభత్సం సృష్టిస్తున్నాడు. ఇప్పటివరకు 69.16 అద్భుతమైన సగటుతో, 182.01 వేగవంతమైన స్ట్రైక్ రేట్‌తో టోర్నీలోనే అత్యధికంగా 415 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. గతంలో వాషింగ్టన్ ఫ్రీడమ్ ఆటగాడు మిచేల్ ఓవెన్ నెలకొల్పిన అత్యంత పిన్న వయస్కుడి సెంచరీ రికార్డును ప్రిటోరియస్ ఈ మ్యాచ్‌తో బ్రేక్ చేశాడు. అంతకుముందు ఎంఐ న్యూయార్క్ జట్టులో ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ 35 పరుగులు చేయగా.. కెప్టెన్ నికోలస్ పూరన్ 19 పరుగులకే పరిమితమయ్యాడు. శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ తరఫున కెప్టెన్ మాథ్యూ షార్ట్ బాల్‌తో అద్భుతంగా రాణించి మూడు వికెట్లు పడగొట్టాడు. పేసర్లు హరీస్ రవూఫ్, ఆరోన్ హార్డీ చెరో రెండు వికెట్లతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు.

# రంగారెడ్డి రైజర్స్‌పై కరీంనగర్ డైమండ్స్ ఘన విజయం



టీజీ 20 లీగ్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్‌పై కరీంనగర్ డైమండ్స్ ఘన విజయం సాధించి క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డిపై కరీంనగర్ 75 పరుగుల తేడాతో నెగ్గింది. 239 పరుగుల భారీ ఛేదనలో రంగారెడ్డి జట్టు 16.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ (63 పరుగులు) హాఫ్ సెంచరీ చేశాడు. చివర్లో నితిన్ సాయి యాదవ్ (50 పరుగులు) పోరాడి ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగాడు. కరీంనగర్ బౌలర్లలో ఆశిశ్ శ్రీవాత్సవ్ 5 వికెట్లతో చెలరేగగా, శుభమ్ శర్మ 2, దినేశ్, నారాయణ్ తేజ, సతీశ్ కుమార్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఛేదనలో రంగారెడ్డి తొలి నుంచే వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అరోన్ జార్జ్ (12 పరుగులు), అలంక్రిత్ రాపోల్ (2), ఆదిత్య జివ్వాలి (17 పరుగులు), జ్ఞాన రెడ్డి (1), వెంకట్ కార్తిక్ (1) స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. అయితే మరోవైపు, ఇంకో ఓపెనర్ తనయ్ త్యాగరాజన్ (63 పరుగులు, 33 బంతుల్లో) మెరుపులు మెరిపించడంతో రంగారెడ్డి పోటీలోనే ఉంది. 7.2 ఓవర్లకు 75-5తో పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయింది. దీంతో రంగారెడ్డి ఓటమి చాలాసేపు ముందే ఖరారైంది. అయితే తనయ్, నితిన్ పోరాటంతో ఎక్కడో ఆశలు చిగురించాయి. కానీ 11.2 ఓవర్ వద్ద తనయ్‌ను శుభమ్ ఔట్ చేశారు. తనయ్, నితిన్ కాసేపు వికెట్ల పతనాన్ని ఆపారు. 24 బంతుల్లో 48 పరుగులు జోడించారు. కానీ తనయ్ ఔటైన తర్వాత రంగారెడ్డి వికెట్ల పతనం మళ్లీ షురూ అయ్యింది. ఓవైపు నితిన్ పోరాడినా అది ఓటమి అంతరాన్ని తగ్గించిందేగానీ మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపించలేదు. శ్రీవాత్సవ్ 5 వికెట్లతో సత్తా చాటాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (137 పరుగులు, 61 బంతుల్లో, 11 ఫోర్లు, 10 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగాడు. హెచ్ కే సింబ (50 పరుగులు, 28 బంతుల్లో) హాఫ్ సెంచరీతో రాణించాడు. దీంతో డైమండ్స్ జట్టుకు భారీ స్కోర్ దక్కింది. రంగారెడ్డి బౌలర్లలో కరియప్ప 2, అరుణ్ కుమార్, తనయ్ త్యాగరాజన్, బింద్రాక్ష్య, నితిన్ యాదవ్ తలో 1 వికెట్ పడగొట్టారు. తాజా విజయంతో కరీంనగర్ జట్టు క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. ఓడిన రంగారెడ్డి రైజర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక ఇవాళ హైదరాబాద్-ఖమ్మం జట్ల మధ్య జరగనున్న తొలి క్వాలిఫయర్‌లో ఓడిన జట్టుతో కరీంనగర్ పోటీ పడాల్సి ఉంటుంది. ఈ రెండో క్వాలిఫయర్ శుక్రవారం ఉప్పల్ వేదికగానే జరగనుంది.

# వర్షంలో 12 గంటలపాటు ఏకబిగిన చిరు షూటింగ్

## మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం



ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది.'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.

# మరో సస్పెన్స్ థ్రిల్లర్... వదల




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.

-----

# సింపుల్ శారీలో కయాదు స్టన్నింగ్ లుక్



నటి, మోడల్ కయాదు లోహార్ తన సహజమైన అందం, అమాయకమైన చిరునవ్వుతో యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. 'ఏం అందంరా బాబు.. సింపుల్‌గా చూసినా మతిపోతోంది' అనేలా కయాదు తాజాగా దిగిన ఫోటోషూట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. జూలై 10న విడుదల కాబోతున్న తన కొత్త సినిమా ప్రమోషన్స్ కోసం ఈ బ్యూటీ ధరించిన మోడ్రన్ స్కై బ్లూ డ్రెస్ ఫ్యాన్స్ గుండెల్లో మంటలు రేపుతోంది. ట్రెడిషనల్ శారీ లుక్‌కు మోడ్రన్ టచ్ ఇస్తూ కయాదు చేసిన ఈ గ్లామర్ విందు ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఆ వివరాలు చూద్దాం. స్కై-బ్లూ లుక్‌లో మెరిసిపోయిన కయాదు: ప్రముఖ డిజైనర్ బ్రాండ్ 'జెనోరా అఫీషియల్' రూపొందించిన కస్టమ్ మేడ్ స్కై-బ్లూ కలర్ మోడ్రన్ డ్రేప్ శారీ లుక్‌లో కయాదు లోహార్ దేవకన్యలా మెరిసిపోయింది. లాంగ్ స్లీవ్స్ ఉన్న మెష్ షీర్ బ్లౌజ్, దానికి మ్యాచింగ్‌గా ఉన్న ఫ్లోర్ లెంత్ డ్రెప్డ్ స్కర్ట్ స్టైల్ శారీలో ఈ చిన్నది స్టన్నింగ్ పోజులు ఇచ్చింది. ఇక స్టైలిస్ట్ ఇనాజ్ ఫర్హాన్ ఆధ్వర్యంలో అట్రాంగి డిజైన్స్ జ్యువెలరీ పెట్టుకుని కయాదు చేసిన ఈ ఫోటోషూట్ చూసి కుర్రకారు అవాక్కవుతున్నారు.అందాల ముద్దుగుమ్మ కయాదు లోహార్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం కలబోసిన ఈ బ్యూటీ మొదట మోడలింగ్‌లో రాణించింది. ఆ తర్వాత కన్నడ చిత్రం 'ముగిల్‌పేట్'తో హీరోయిన్‌గా వెండితెరకు ఎంట్రీ ఇచ్చింది. ఇక మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకున్న ఈ చిన్నది, ఆ తర్వాత తెలుగులో 'అల్లూరి' సినిమాలో నటించి మెప్పించింది. ఇక 'డ్రాగన్' మూవీతో యూత్ లేటెస్ట్ క్రష్‌గా మారిపోయింది. 'హృదయం మురళి' ప్రమోషన్స్ హడావిడి: అథర్వా మురళి హీరోగా నటిస్తున్న 'ఇదయం మురళి' (తెలుగులో 'హృదయం మురళి') సినిమాలో కయాదు లోహార్ ప్రధాన కథానాయికగా నటించింది. ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా ప్రీతి ముఖుందన్ నటిస్తుండగా, నిహారిక ఎన్ఎమ్ కీలక పాత్రలో కనిపిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగానే కయాదు ఈ రేంజ్‌లో గ్లామర్ తడాఖా చూపించి సినిమాపై అందరిలోనూ ఆసక్తిని పెంచేసింది. జూలై 10న గ్రాండ్ రిలీజ్: మంచి అంచనాలు ఉన్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ముఖ్యంగా తెలుగులో ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ 'మైత్రీ మూవీ మేకర్స్' విడుదల చేస్తుండటంతో సినిమాపై మంచి హైప్ క్రియేట్ అయ్యింది. ాశ్రీంశీ =ఖుం - సెన్సార్ బోర్డ్ ఇబ్బందుల్లో సినిమాలు! ఎలాంటి లుక్‌లో ఉన్నా తన సహజమైన నవ్వుతో, అందంతో మాయ చేయడం కయాదు లోహార్‌కే చెల్లింది. ఈ సింపుల్ అండ్ స్టైలిష్ స్కై-బ్లూ లుక్‌తో తనేంటో మరోసారి ప్రూవ్ చేసుకుంది. జూలై 10న రాబోతున్న 'హృదయం మురళి' సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో మరియు కయాదుకు ఎలాంటి బ్రేక్ ఇస్తుందో చూడాలి!

# జన నాయగన్ విడుదలకు సిద్ధం



విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.


-----

# అఖిల్ ఈసారి హిట్ పక్కా అంటున్న ఫ్యాన్స్!



అఖిల్ తన కెరియర్ ను మొదలుపెట్టి చాలాకాలమే అయింది. అయితే అఖిల్ పై అభిమానులు పెట్టుకున్న అంచలనాలను గత సినిమాలు అందుకోలేకపోయాయి. అఖిల్ మంచి అందగాడు. డాన్స్ .. ఫైట్స్ లోను అఖిల్ కి వంక బెట్టడానికి లేదు. నటన పరంగా కూడా మంచి మార్కులే సంపాదించుకున్నాడు. అయితే అఖిల్ కి తగిన హిట్ మాత్రం ఇంకా ఆయనను వరించలేదనే చెప్పాలి. ఆ సమయం కోసమే ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అఖిల్ చేసిన సినిమానే 'లెనిన్'. సూర్యదేవర నాగవంశీ - నాగార్జున కలిసి నిర్మించిన సినిమా ఇది. మురళీ కిశోర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, రేపు థియేటర్లకు రానుంది. ఈ సినిమా నుంచి వదిలిన సాంగ్స్ కీ .. ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అఖిల్ - భాగ్యశ్రీ బోర్సే జోడీ మార్కులు కొట్టేసింది. ఇంతవరకూ అఖిల్ చేసిన పాత్రలకు పూర్తి డిఫరెంట్ గా ఉండే పాత్ర కావడం, ఈ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. రామాపురం - భారతం మిట్ట అనే రెండు గ్రామాల మధ్య నడిచే కథ ఇది. ఆ గ్రామాలకు చెందిన ఇద్దరు ప్రేమికుల చుట్టూ పరిగెత్తే కథ ఇది. గ్రామీణ రాజకీయాలు .. అక్కడ ప్రతి ఏడాది జరిగే జాతర ప్రధానంగా ఈ కథ కొనసాగుతుంది. లవ్ .. యాక్షన్ .. ఎమోషన్స్ ఈ కథలో బలంగా కనిపిస్తున్నాయి. విలేజ్ బ్యాక్ గ్రౌండ్ లో గతంలో నాగార్జున చేసిన సినిమాలు భారీ విజయాలను అందుకున్నాయి. అలాగే అఖిల్ కి కూడా ఈ సినిమా భారీ విజయాన్ని సాధించి పెడుతుందనేది ఫ్యాన్స్ బలంగా చెబుతున్న మాట.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన పెద్ది




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'పెద్ది' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, థియేటర్ వెర్షన్ కంటే ఓటీటీలో కొన్ని సీన్స్ యాడ్ చేశారు. రన్‌టైం కారణంగా కట్ చేసిన సన్నివేశాలను, థియేటర్‌లో విడుదలైయ్యాక తొలగించిన సీన్స్‌ను కూడా ఇందులో యాడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో అభిమానులు ఖుష్ అవుతున్నారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. కథేంటంటే.. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా.. ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు లేదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన వాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేస్తాడు. పేరుకి కూలీ అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటాయి. ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టగలిగిన మొనగాడైన పెద్దిని అంతా ఆట కూలీ అని పిలుస్తుంటారు. అలాంటి పెద్ది క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు?తన గ్రామం కోసం పెద్ది ఏం చేశాడు? అన్నదే సినిమా కథ.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com